నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 11-1-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక: 143 పేజీలు: 4 వెల: రూ.1/-

'సీఏఏ'పై అన్ని పిటిషన్లను 22నే విచారిస్తాం

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

- హైకోర్టుల్లో వ్యాజ్యాలు వేసిన పిటీషన్‌దారులకు నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి10(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ సవరణ చట్టంపై దాఖలైన పిటీషన్లన్నింటిని ఈనెల 22నే విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పౌరసత్వ సవరణ చట్టంపై వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వం అభ్యర్థనను పరిగణన లోకి తీసుకున్న ధర్మాసనం.. హైకోర్టుల్లో వ్యాజ్యాలు వేసిన పిటిషన్‌దారులకు నోటీసులు జారీ చేసింది. కేంద్రం బదిలీ పిటిషన్‌తో పాటు సీఏఏకు సంబంధించిన అన్ని పిటిషన్లపై ఈ నెల 22న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు లోనూ దాదాపు 60 పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై గత నెల విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 22కు వాయిదా వేసింది. ఇప్పుడు కేంద్రం వేసిన తాజా బదిలీ పిటిషన్‌ను కూడా ఆ రోజే వింటామని ధర్మాసనం వెల్లడించింది. మరోవైపు సీఏఏ, ఎన్సార్సీకి వ్యతిరేకంగా గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న బనారస్ హిందూ విశ్వవిద్యాలయం విద్యార్థులు, సివిల్ సొసైటీ సభ్యులను కలిసేందుకు కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ శుక్రవారం వారణాసి వెళ్లారు.

దక్షిణాది పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయండి

- బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

- కేంద్రమంత్రి పీయూష్‌తో భేటీ అయిన కేటీఆర్

న్యూఢిల్లీ, జనవరి10(ఆర్ఎన్ఎ) : నాలుగు రాష్ట్రాల మధ్య దక్షిణాది పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని, ఇందుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కోరారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కేటీఆర్ శుక్రవారం సమావేశమయ్యారు.

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రితో భేటీ అయిన కేటీఆర్.. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లో జరిగే బయో ఆసియా సదస్సుకు రావాల్సిందిగా కేంద్ర మంత్రిని కేటీఆర్ ఆహ్వానించారు. వరంగల్ - హైదరాబాద్ కారిడార్, హైదరాబాద్ - నాగపూర్ కారిడార్‌లు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ - బెంగళూరు - చెన్నైను కలుపుతూ నాలుగు రాష్ట్రాల మధ్య దక్షిణాది పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ఇందుకోసం కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కేటీఆర్ కోరారు. ఈ అంశంపై దక్షిణాది మంత్రులకు లేఖలు కూడా రాశామని పేర్కొన్నారు. తెలం గాణలో ఏర్పాటు చేయనున్న డ్రైపోర్టు తోపాటు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులకు మద్దతు ఇవ్వాలని మంత్రి కేటీఆర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఫార్మా క్లస్టర్ అయిన 'హైదరాబాద్ ఫార్మా సిటీ, జహీరాబాద్ నిమ్స్' వివరాలను కేంద్ర మంత్రి అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ ప్రస్తావించిన అంశాలపై వెంటనే ఒక నివేదిక ఇవ్వాలని పీయూష్ గోయల్ తన కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

సీబీఐ కోర్టుకు హాజరైన.. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

- ఈనెల 17కు విచారణ వాయిదా వేసిన కోర్టు

హైదరాబాద్, జనవరి10(ఆంఎన్ఎ) : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ముఖ్యమంత్రి హోదాలో జగన్ కోర్టుకు హాజరవడం ఇదే తొలిసారి. సీబీఐ, ఈడీ కోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు విచారణను ఈ నెల 17కు వాయిదా వేస్తున్నట్లు నాంపల్లిలోని సీబీఐ కోర్టు తెలిపింది. డిశ్చార్జి పిటిషన్లు అన్ని కలిపి విచారణ జరపాలన్న జగన్ పిటిషన్‌పై శుక్రవారం వాదనలు పూర్తయ్యాయి. తదుపరి విచారణను కోర్టు 17కు వాయిదా వేసింది. గత ఎనిమిదేళ్లుగా ఈ కేసు విచారణ జరుగుతోంది. సీబీఐ దాఖలు చేసిన 11ఛార్జిషీట్లు సహా ఈడీ నమోదు చేసిన ఆరు ఛార్జిషీట్లకు సంబంధించిన విచారణకు శుక్రవారం కచ్చితంగా హాజరుకావాలని జగన్, విజయసా యిరెడ్డిని ఈ నెల 3న సీబీఐ కోర్టు ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో జగన్ శుక్రవారం కోర్టులో హాజరయ్యారు. జగన్ గతేడాది మార్చి 22న చివరిసారిగా కోర్టుకు హాజరయ్యారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు జగన్ చేరుకున్నారు. అక్కడ్నుంచి నేరుగా నాంపల్లి సీబీఐ కోర్టుకు జగన్ వచ్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ధర్మాన ప్రసాదరావు, విజయసాయి రెడ్డి, ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి, రిటైర్డ్ ఐఏఎస్ శామ్యూల్ విచారణకు హాజరయ్యారు. ఇదిలాఉంటే విచారణ సమయంలో ఈడీ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కావాలని జగన్ కోరారు. తన తరపున సహ నిందితుడు హాజరవుతారని అడిగారు. తాను కీలకమైన పదవిలో ఉన్నందున కోర్టుకు హాజరు కాలేనని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

బేగంపేట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వీడ్కోలు పలికిన గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్

జూబ్లీహిల్స్ సీఐ, ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంజనీకుమార్

హైదరాబాద్, జనవరి10(ఆర్ఎన్ఎ) : హైదరాబాద్‌లో అవినీతి ఖాకీలపై వేటు పడింది. అవినీతి ఆరోపణలపై జూబ్లీహిల్స్ సీఐ బలవంతయ్య సస్పెండ్ అయ్యారు. ఆయనను విధుల నుంచి తప్పిస్తూ హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచి పరారీలో ఉన్న బలవంతయ్య కోసం ఏసీబీ అధికారులు గాలిస్తున్నారు. అతడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో బంధువుల ద్వారా అతని ఆచూకీ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎస్ ఐ సుధీర్ రెడ్డి పోలీస్ స్టేషన్ లోనే లంచం తీసుకుంటూ పట్టుబడటం కలకలం రేపింది. స్టేషన్ బెయిల్ కోసం వంశీ కృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.50 వేలు తీసుకుంటూ సుధీర్ రెడ్డి ఏసీబీకి చిక్కాడు. అయితే సీఐ బలవంతయ్య చెబితేనే ఆ డబ్బులు తీసుకున్నానని సుధీర్ రెడ్డి చెప్పారు. దీంతో సీఐ బలవంతయ్యపై కూడా కేసునమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బలవంతయ్య పరారయ్యాడు. సీఐ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సుధీర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఎస్ఐ, సీఐలను హైదరాబాద్ సీపీ సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలో ఇలాంటి చర్యలను పేక్షించేది లేదని హెచ్చరించారు. నగరంలో లంచం డిమాండ్ చేస్తే 9490616555 నెంబర్ కు ఫోన్ చేసి..తనకు నేరుగా ఫిర్యాదు చేయాలని సీపీ అంజనీకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2019, డిసెంబర్ 29న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు నమోదు అయింది. ఆ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు వంశీ కృష్ణ వద్ద నుంచి మొత్తం రూ.50 వేలు, రెండు స్కాచ్ బాటిల్స్ ను కూడా ఎస్ ఐ సుధీర్ రెడ్డి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సివిల్ తగాదాలో ఎస్ ఐ సుధీర్ రెడ్డి ప్రమేయం ఉంది. అలాగే సీఐ బలవంతయ్య ఆదేశాల మేరకే ఆ డబ్బులు డిమాండ్ చేసి, డబ్బులు తీసున్నట్లు ఏసీబీ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో సీఐ బలవంతయ్యలపై వేటు పడింది. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ ఐ సుధీర్ రెడ్డిపై కూడా వేటు పడింది. ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెదక్ జిల్లా గజ్వేల్ ప్రాంతానికి చెందిన సుధీర్ 2014 బ్యాచ్‌కు చెందిన వాడు. జూబ్లీహిల్స్ పీఎస్‌లో 18 నెలల నుంచి పని చేస్తున్నారు. అడ్మిన్ ఎస్ఐ..విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కూడా సివిల్ తగాదాల్లో లంచాలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. 50 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందడంతో దాడి చేశారు. ఈ ఘటనలో సీఐ బలవంతయ్య పాత్ర కూడా ఉందని సుధీర్ రెడ్డి చెప్పారు. మూడు చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

తెలంగాణ యూనివర్శిటీలో చిరుత కలకలం

- భయాందోళనలో విద్యార్థులు

నిజామాబాద్, జనవరి10(ఆర్ఎన్ఎ) నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో చిరుత సంచరిస్తుండడం కలకలం రేపుతోంది. శుక్రవారం తెల్లవారు జామున క్యాంపస్‌లో చిరుత కనిపించినట్లు విద్యార్థులు వెల్లడించారు. ఎంసీఏ భవనం వద్ద చిరుత కనిపించిందని, విషయాన్ని వెంటనే విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు తెలిపినట్లు వెల్లడించారు. స్పందించిన వర్సిటీ రిజిస్ట్రార్ సీం వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు క్యాంపస్‌కు చేరుకొని చిరుత ఆనవాళ్లు తెలుసుకొనేందుకు పరిసర ప్రాంతాలు పరిశీలించారు. చిరుత జాడ కోసం అధికారులు సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పులి గాండ్రింపు శబ్దం వినగానే భయంతో పరుగులు తీసినట్లు విద్యార్థులు తెలిపారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో చిరుత కనిపించినట్లు చెప్పారు. నాకు కొంచెం దూరంలోనే చిరుత ఉందిని, మొదటిసారి ఏదో శబ్దం వస్తే నేను పట్టించుకోలేదని, మళ్లీ గాండ్రింపు శబ్దం వచ్చేసరికి వెనక్కి తిరిగి చూశానని, పులి కనిపించిందని ఓ విద్యార్థి తెలిపారు. ఇక వెంటనే అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ వచ్చేశానని అన్నారు. అక్కడే ఎంబీఏ విద్యార్థులు కూడా ఉండడంతో విషయం చెప్పానని, వారు కూడా కాలేజీకి వెళ్లకుండా వెనక్కి వచ్చేశారని స్వామి అనే విద్యార్థి మీడియాతో అన్నాడు.

మిస్సైళ్లతో విమానాన్ని పేల్చలేదు..

- మీ దగ్గర డేటా ఉంటే ఇవ్వండన్న ఇరాన్

టెహ్రాన్, జనవరి10(ఆర్ఎన్ఎ) : ఇరాన్ రాజధాని టెహ్రాన్ సమీపంలో కూలిన ఉక్రెయిన్ విమానంపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడి వల్ల.. ఉక్రెయిన్ విమానం కూలినట్లు పాశ్చాత్య దేశాలు ఆరోపిస్తున్నాయి. అమెరికా, కెనడాతో పాటు ఇతర కొన్ని దేశాలు ఆ అంశాన్ని ధ్రువీకరిస్తున్నాయి. దీంతో ఇరాన్ ఈ ఘటనపై శుక్రవారం స్పందించింది. ఇరాన్ మిస్సైళ్లు ఉక్రెయిన్ విమానాన్ని కూల్చినట్లు వస్తున్న వార్తలను ఆ దేశం ఖండించింది. విమాన ప్రమాదంలో 176 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ ఢీకొట్టినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఇరాన్ పేర్కొన్నది. కచ్చితంగా ఉక్రెయిన్ విమానాన్ని ఎటువంటి మిస్సైల్ ఢీకొట్టలేదని ఇరాన్ పౌరవిమానాయశాఖ అధికారి అలీ అబెద్‌జాదె తెలిపారు. ఒకవేళ పాశ్చాత్య దేశాలు చేసే ఆరోపణల్లో వాస్తవం ఉంటే, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం వాళ్లు తమ దగ్గర ఉన్న డేటాను ఇవ్వాలన్నారు. విమాన బ్లాక్ బాక్సుల నుంచి డేటాను సేకరించడానికి మరో నెల సమయం పడుతుందని, ఈ ఘటనపై విచారణ పూర్తి కావడానికి ఏడాది కాలం పడుతుందని దర్యాప్తు అధికారి హసన్ రెజాఫర్ తెలిపారు.

ఉక్రెయిన్ విమాన ప్రమాదంపై యూఎస్ విచారణ

న్యూయార్క్,జనవరి10(ఆర్ఎన్ఎ): ఉక్రెయిన్‌కి చెందిన బోయింగ్ విమానం ఇరాన్‌లో కూలిపోయిన ఘటనపై దర్యాప్తులో తాము కూడా పాల్గొననున్నట్టు అమెరికా జాతీయ రవాణా భద్రతా సంస్థ (ఎన్‌టీఎస్‌బీ) వెల్లడించింది. బుధవారం చోటుచేసుకున్న విమాన ప్రమాదంపై విచారణలో పాలుపంచుకోవాలంటూ ఇరాన్ నుంచి తమకు అధికారిక సమాచారం అందినట్టు ట్విటర్లో ఎన్‌టీ ఎస్‌బీ ప్రకటించింది. విమాన ప్రమాదానికి గల కారణాలు, ఘటనా స్థలం చుట్టుపక్కల పరిస్థితులను అన్వేషిస్తామని పేర్కొంది. అమెరికాలో తయారైన బోయింగ్ 737 విమానం ఇరాన్ రాజధాని టెహరాన్ నుంచి బయల్దేరిన కొద్ది క్షణాలకే కూలిపోయిన సంగతి తెలిసిందే. ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడిన కొద్దిసేపటికే విమానం కూలిపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది.

చరిత్రలో నేటినిజం

కం॥ వెనుకంజ వేయుటెరుగక
మునుముందుకు నడచినడచి మూర్ఖన్నాళై
ఘనుడై...ఆ జయమునొందుగ....
రణ జన్మునొ లుచుచుంటి "లాల్బహాదూరున్"!!

(జనవరి 11 లాల్బహాదూర్ శాస్త్రి పుణ్యతిథి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

పుస్తకావిష్కరణ

ఆహ్వానం

ప్యూపా

సుజనా రాజు



అభినందనలతో

తెలుగు రైటర్స్ అసోసియేషన్ మహారాష్ట్ర (త్వమ్)

పూణే ఆంధ్ర సంఘం

తెలుగు సాహితీ పీఠం

తెలుగు కళా సమితి

A K మీడియా

సాదర ఆహ్వానం

జనవరి 12, 2020 ఉ 10 గం లకు

పుణే ఆంధ్ర సంఘం, రాంగ్లర్ పరంజపే రోడ్, డెక్కన్, పుణే

ముఖ్య అతిథి

శ్రీ అమరేంద్ర దాసరి

ప్రముఖ రచయిత, వక్త

గౌరవ అతిథులు

శ్రీమతి తురగా జయ శ్యామల
ప్రముఖ రచయిత్రి

శ్రీ టి ఎ శ్రీనివాస్
తెలుగు సాహితీ పీఠం అధ్యక్షులు

శ్రీ మాదిరెడ్డి కొండా రెడ్డి
తెలుగు కళా సమితి, వాషి అధ్యక్షులు

శ్రీ మోహన్ నాయుడు
పూణే ఆంధ్ర సంఘం అధ్యక్షులు

శ్రీ సంగివేని రవీంద్ర
ప్రముఖ రచయిత

శ్రీ నేమాని ప్రసాద్
ప్రముఖ రచయిత

శ్రీ కలిదిండి వర్మ
ప్రముఖ కవి, భీమవరం

పుస్తక సమీక్ష

పుస్తక/రచయిత్రి పరిచయం

శ్రీ త్యాగరాజా
రచయిత

శ్రీమతి రవీన చవాన్
రచయిత్రి

విశిష్ట అతిథులు
కవులు, రచయితలు, పత్రికా విలేఖరులు

మీర్జాదిగూడ తెరాసలో ముసలం

- అధికార పార్టీని వీడిన దర్గా దయాకర్

- ఎంపీ రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

- మీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

- ధీమా వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (ఆర్ఎన్ఎ) : మీర్జాదిగూడ టీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైంది. టీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకు న్నారు. పీర్జాదిగూడ మేయర్ టికెట్ ఆశిస్తూ టీఆర్ఎస్ నాయకుడు దర్గా దయాకర్ రెడ్డి గురువారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. కానీ, టీఆర్ఎస్ అధినాయకత్వం దయాకర్ రెడ్డికి టికెట్ ఇవ్వడానికి ఒప్పుకోలేదు. అంతేకా కుండా ఆయనకు సీఎం కేసీఆర్ నుంచి ఎటువంటి హామీ లభించలేదు. దాంతో దయాకర్ రెడ్డి అలిగి వెళ్లిపోయారు. శుక్రవారం ఆయన ఇంటికి కాంగ్రెస్ లీడర్, ఎంపీ రేవంత్ రెడ్డి వెళ్లారు. రేవంత్ రెడ్డి సమక్షంలో దయాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దయాకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే, రేవంత్ రెడ్డి ఆయనకు బీ ఫామ్ స్వయంగా అందజేశారు. అంతేకాకుండా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను కూడా దయాకర్ రెడ్డికే అప్పగించారు. రేవంత్ సమక్షంలో దయాకర్ రెడ్డితో పాటు పలువురు టీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ల మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని అన్నారు. సీనియర్లను పట్టించుకోని టీఆర్ఎస్ పార్టీకి ఇది ఒక గుణపాఠం అవుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా డబ్బులతో రాజకీయం చేయాలని అనుకునే వాళ్లకు కనువిప్పు కలగాలని ఆయన అన్నారు. ప్రజలకు సేవ చేస్తే నాయకులవుతారుగానీ, డబ్బులు ఖర్చు చేస్తే నాయకులు కారని రేవంత్ అన్నారు.

బడ్జెట్‌తో ఆకట్టుకునే ప్రయత్నంలో మోడీ

ఆర్థికవేత్తలతో చర్చపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ,జనవరి10(ఆర్ఎన్ఎ): ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. 1న బడ్జెట్ ప్రవేశ పెడతారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో కసరత్తు భారీగానే ఉండవచ్చు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో ఈ బడ్జెట్లో గొప్ప ఊరట లభించేలా కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఇది సాధారణ బడ్జెట్ కానుండడంతో కసరత్తు భారీగానే ఉంటుందని సమాచారం. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపును; పన్ను శ్లాబులను పెంచే దిశగా ఆర్థిక శాఖ యోచిస్తోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో పన్ను విషయంలో ఎలాంటి వెసలుబాటు తీసుకోలేదు. మధ్యాదాయ వర్గాలకు ఊరటనివ్వడం కోసం పన్ను శ్లాబులను సైతం మెరుగు పరచే దిశగా ఆ శాఖ పనిచేస్తోందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రిటైల్ ద్రవ్యోల్బణం ప్రభావం పడుతున్న వేతన జీవుల కోసం ఆ చర్యలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. గత బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పన్ను శ్లాబులలో మార్పులు చేయనప్పటికీ.. తక్కువ పన్ను చెల్లింపుదార్లకు ఊరటనిచ్చారు. అయినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. మోదీ తీసుకున్న ఆర్థిక నిర్ణయాల వల్ల పరిణామాలు కొంత నష్టం చేకూర్చినందువల్ల ఊరటలు ఉంటాయన్న వాదన ఉంది. రాజకీయాలను పట్టించుకోకుండా తీసుకున్న పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు మోదీ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేశాయి. ఇది పార్టీలో కూడా ప్రభావం చూపింది. అందరూ మోడీని ఎదరించి మాట్లాడకున్నా లోలోపల మదన పడుతున్నారు. పలు సందర్భాల్లో నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఏమి చేయాలనుకున్నా చెప్పాల్సింది ఈ బడ్జెట్‌లోనే. మోదీ ప్రభుత్వం కేవలం భావోద్వేగాలను నమ్ముకుంటుందా, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిజాయితీ ప్రదర్శిస్తుందా అన్నది ఈ బడ్జెట్‌తోనే తేలుతుంది.దేశంలో భావోద్వేగ పరిస్థితులను హిందువులను సంఘటిత పరిచేందుకు బీజేపీ ఉపయోగించు కోవడాన్ని గమనించిన ఇతర పార్టీలు కూడా అదే మార్గంలో పయనిస్తున్నాయి. పరిణామాల ఎలా ఉన్నప్పటికీ ప్రజల నిత్యావసరాలు, ఇతర సమస్యలు తీర్చడంపై రాజకీయ పార్టీలు కృషి చేసేందుకు ఆస్కారం లేకుండా పోతున్నది. ఈ క్రమంలో పార్లమెంట్ కూడా సరైన విధంగా సాగడం లేదు. తాయిలాలు ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నాలు ఈ బడ్జెట్‌లో చేసేలా కనిపిస్తోంది. ఆర్థికవేత్తలతో భేటీలో అనేక అంశాలపై చర్చించారు. వారి సూచనలను ఏ విధంగా ముందుకు తీసుకుని వెళతారో చూడాలి.

జోరుగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్

మొక్కలు నాటిన నాగేందర్

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో ప్రజాప్రతినిధులు జోరుగా పాల్గొంటున్నారు. ఎక్కడికక్కడ మొక్కలు నాటేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మొక్కలు నాటారు. ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్న నేపథ్యంలో ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఛాలెంజ్ కార్యక్రమం తీసుకోవడం అభినందనీయ మన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇందులో పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్, సినీ నిర్మాత దిల్ రాజు, ఏపీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ముషారఫ్ అలీకి గ్రీన్ ఛాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నే కవిత, బంజారాహిల్స్ పోలీస్ సిబ్బంది, కంగారూ కిడ్స్ స్కూల్ చిన్నారులు, టీచర్లు పాల్గొన్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ ఎంపీ రఘురాం కృష్ణంరాజు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని.. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన హరితహారంలో భాగంగా..ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టడం చాలా మంచి కార్యక్రమమని అన్నారు. మొక్కలు లేనిది మానవాళి లేదు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఒక్క మహత్తర ఉద్యమంగా మారి బంగారు తెలంగాణలో భాగంగా హరిత తెలంగాణ, ఆకుపచ్చని తెలంగాణగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతో తెలంగాణ చక్కటి, పచ్చటి తెలంగాణ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎంపీ రఘురాం కృష్ణంరాజు అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరి సహకారం ఉండాలని కోరారు. హీరో బాలకృష్ణ, సినీ నిర్మాత అశ్విన్ దత్, మాజీ క్రికెట్ ప్లేయర్ చాముండేశ్వర్ నాథ్‌కు నేను గ్రీన్ ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు.

గ్రీన్‌ఛాలెంజ్‌లో భాగంగా నగరంలో మొక్కలు నాటిన టిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్

సీఏఏకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ

- సీసీఏ, ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా నినాదాలు

హైదరాబాద్, జనవరి10(ఆర్ఎన్ఎ) : సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ, ఎంఐఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పాతబస్తీ మీరాలం ఈద్గా నుంచి రాజేంద్రనగర్ వరకు ముస్లింలు ర్యాలీ చేశారు. సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేశారు. వేలాది మంది ముస్లింలు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో మహిళలు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మరోవైపు శాంతి భద్రతలకు విఘాతం కలిస్తే కేసులు పెట్టాలని హైకోర్టు ఆదేశించింది. సీఏఏను వ్యతిరేకిస్తూ ఎంఐఎం తలపెట్టిన ర్యాలీకి అనుమతించొద్దని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది. మీరాలం నుంచి శాంతిపురం వరకే ర్యాలీకి అనుమతిచ్చామని కోర్టుకు పోలీసులు తెలిపారు. పోలీసులు అనుమతి ఇచ్చిన పరిధి వరకే ర్యాలీ చేసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డిని ధర్మాసనం అదేశించింది. అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేయాలని, ర్యాలీ మొత్తం కూడా వీడియో తీయాలని డీజీపీకి హైకోర్టు ఆదేశించింది. ఇటీవల ఎన్పీఆర్, ఎన్ఆర్సీ, సీఏఏకు వ్యతిరేకంగా ట్యాంక్‌బండ్‌పై ముస్లింలు మిలియన్ మార్చ్ చేపట్టారు. ఎన్పీఆర్, ఎన్ఆర్సీ, సీఏఏకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి పెద్ద ఎత్తున ముస్లింలు తరలి వచ్చారు. భారీ ర్యాలీతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ధర్నాచౌక్ దగ్గర ర్యాలీలో కాంగ్రెస్ నేత వీహెచ్, అజీజ్ పాషా పాల్గొన్నారు.

నేటినిజం
శుక్రవారం 10-1-2020

ఇదీ 'ప్రపంచీకరణ' ఫలితం..

వివిధ ప్రాంతాలలోని 'ఆసుపత్రుల'లో నవ జాత శిశువులు, చికిత్సకోసం చేరిన శిశువులు చనిపోయి ఉండడం గురించి ఏళ్లతరబడి ప్రచారం జరుగుతోంది. గుజరాత్‌లోను, రాజస్థాన్‌లోను ఇటీవల జరిగిన శిశు మరణాలు పరాకాష్ఠ. రాజస్థాన్‌లోని కోట నగరంలోని 'జెకెలోన్'అన్న వైద్యశాలలో ముప్పయి ఐదు రోజులుగా ప్రతిరోజూ "అంతుపట్టని" శిశు మరణాలు సంభవించాయి. దాదాపు నూట పది మంది శిశువులు ఈ కాలవ్యవధిలో అకాల మృత్యువు పాలయ్యారు. అయినప్పటికీ వైద్యశాల నిర్వాహకులు కాని, ప్రభుత్వాలు కాని నిరోధక చర్యలు తీసుకోకపోవడం వైఫల్యం మాత్రమే కాదు క్రూరమైన నిర్లక్ష్యం కూడ. ఈ క్రూరమైన నిర్లక్ష్యం ఎవరిదన్న విషయమై వారాల తరబడి రాజకీయ ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. గుజరాత్‌లోని రెండు ప్రధాన వైద్యశాలలలో డిసెంబర్‌లో నూట తొంబయి తొమ్మిది మంది శిశువులు మరణించడం సమాంతర మైపరీత్యం. రాజకోట, అహమ్మదాబాద్ నగరాలలోని వైద్యశాలలలో ఈ మరణాలు సంభవించాయట. అక్టోబర్, నవంబర్ మాసాలలో రాజ్‌కోటలోని వైద్యశాలలలో రెండువందల అరవై తొమ్మిది మంది శిశువులు, అహ్మదాబాద్‌లోని వైద్యశాలలలో ఇదే కాలవ్యవధిలో రెండు వందల యాబయి ముగ్గురు శిశువులు మరణించడం మానవత్వం నిండిన గుండెల వారిని కలచివేస్తున్న విషాదం!

కోట వైద్యశాలలో జరిగిన మరణాలకు తమ ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉందని రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సచిన్ పైలట్ స్వయంగా ప్రకటించడం నిర్లక్ష్యం నిహితమై ఉన్న ప్రభుత్వ వ్యవస్థకు సరికొత్త ధ్రువీకరణ. ఈ 'కోట'వైద్యశాల ప్రాంగణంలో పందులు యధేచ్ఛగా విహరిస్తున్నాయట... 'నిర్లక్ష్యం', 'క్రూరత్వం', 'లంచగొండితనం' వీటన్నింటికీ మించి ప్రజల హృదయ క్షేత్రాన్ని ఆవహించిన 'తరతరాల' పట్టించుకోనితనం వైద్య రంగాన్ని మాత్రమే కాదు, సకల జీవన రంగాలను సంక్షుభితం చేస్తున్నాయి. 'వ్యాపార సౌలభ్యం' ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్– గురించి ప్రభుత్వాలు హోరెత్తిస్తున్నాయి, మన దేశంలో వ్యాపార వాణిజ్య పారిశ్రామిక సౌలభ్యం పెరిగిందని బహుళ జాతీయ వాణిజ్య సంస్థలకు విశ్వాసం కలిగిస్తున్నాయి. ఇలా 'విశ్వాసం'నిండిన 'బహుళ జాతీయ సంస్థలు' దేశంలోకి చొఱబడిపోతుండడం ఇరవై ఆరేళ్ల 'ప్రపంచీకరణ' చరిత్ర! వాణిజ్య సౌలభ్యం పెరగడంలో 'బహుళ సంస్థలు' ప్రధానంగా విదేశీయ వ్యాపారపు 'ముఠాలు' మనలను దోపిడీ చేయడం మొదలైంది. ఈ దోపిడీ చేసే ప్రవృత్తి స్వదేశీయ వాణిజ్య సంస్థలను కూడ ఆవహించడం 'ప్రపంచీకరణ' ఫలితం... ఫలితంగా 'జీవన సౌలభ్యం' అడుగంటిపోతోంది! "గిరాకీ, లభ్యత"– డిమాండ్, సప్లయ్– ప్రాతిపదికగా సామాజిక వ్యవస్థ నడుస్తోంది. ప్రజల అవసరం, జన జీవన సౌలభ్యం వంటి వాటికి ప్రాధాన్యం లేదు. అందువల్ల దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర వాణిజ్య రంగంలో మాత్రమేకాక సకల జీవన రంగాలలోను "లభ్యత– గిరాకీ" ప్రాతిపదికగా వ్యవస్థలు వికసించాయి, వికసిస్తున్నాయి... ఈ వికసన ప్రవృత్తికి 'బుద్ధి'పెద్దది, అందువల్ల దోపిడీ చేయగలుగుతోంది... ఈ వికసన క్రమానికి 'హృదయం'లేదు. అందువల్ల విద్యావంతులను, వైద్యులను, అధికారులను, రాజకీయ వేత్తలను 'క్రౌర్యం' ఆవహించి ఉంది! 'ప్రపంచీకరణ' మొదలుకాక పూర్వం దశాబ్దుల క్రితమే అత్యధిక శాతం ఉన్నత విద్యావంతులు అవినీతిపరులు కావడం చరిత్ర... ఈ చరిత్రకు బ్రిటన్ దురాక్రమణ సమయంలో అంకురార్పణ జరిగింది. 'హృదయం'లేని బుద్ధిజీవులు విస్తరించడం బ్రిటన్ వారి విద్యావ్యవస్థ ఫలితం! అది ఇప్పటికీ కొనసాగుతోంది. ఉన్నత వైద్యులకు, అధికారులకు 'నైతిక ధ్యాస' లేకపోవడానికి ఇదీ కారణం...ఇదీ గాక అక్రమాలు జరుపుతున్న 171 వైద్యశాలలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల అభియోగాలను నమోదు చేసిందట...అవునా..?

నిరంతర విద్యుత్‌లో ఎన్టీపీసీ ఉత్పతి కీలకం

–వేగంగా పూర్తవుతున్న ప్రాజెక్ట్ పనులు

కరీంనగర్,జనవరి10(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రామగుండం ఎన్టీపీసీలో నిర్మిస్తున్న రెండు యూనిట్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసుకోబోతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు విద్యుత్ అవసరాలు తీర్చడంలో ఇదే కీలకం. రామగుండం ఎన్టీపీసీలో రాష్ట్ర ప్రభుత్వం 800 మెగావాట్ల చొప్పున నిర్మిస్తున్న రెండు యూనిట్ల విద్యుత్ ప్లాంట్ పనులను గతంలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇవి పూర్తయితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరు. అందుకే ఎన్టీపీసీ ఉత్పత్తిపై సిఎం కెసిఆర్ స్వయంగా పరిశీలించారు. నిర్దిష్ట గడువులోపు విద్యుత్ ప్లాంట్లు పూర్తికావాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణాలు, వాటికి అవసరమయ్యే విద్యుత్ వంటి విషయాలను అధికారులకు వివరించారు. ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యుత్ ప్లాంట్ల పనులు అదేస్థాయిలో ముందుకు వెళ్లాలని సూచించారు. నిర్దిష్ట గడువులోపు రెండు యూనిట్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ప్రకటించిన నేపథ్యంలో విద్యుత్ లభ్యతపై ఎక్కడా ఏమరుపాటు లేకుండా వ్యవహరిస్తున్నారు. 2020 మే వరకు మొదటి యూనిట్ పనులు పూర్తిచేస్తామని, మరో ఆరు నెలల తరువాత రెండో యూనిట్ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశించిన లక్ష్యంలోగా పూర్తిచేయాలని బీఎచ్ఈఎల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ సంస్థల అనుసంధానం తదితర అంశాలను జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పవర్ ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణకు అవసరమైన నీరు అందించడంతోపాటు ఇతర సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. స్థానికంగా కొండలు, గుట్టలు ఉన్నందున 400మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు సబ్‌స్టేషన్లను భూగర్భంలోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఏడు పంపు సెట్లలో వచ్చే జూన్ నాటికి రెండు, డిసెంబర్ నాటికి మొత్తం పంపుసెట్లు బిగిస్తామని బీఎచ్ఈఎల్ జీఎం సుందర్ రాజన్ గతంలోనే తెలిపారు. లక్ష్మీపూర్‌వద్ద పంప్‌హౌస్, 400 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం పనులు కూడా జరుగుతున్నాయి. ఇక్కడ నీటిని లిఫ్ట్ చేయడానికి 139 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఏడు పంపులు నడిపించేందుకు అవసరమైన 973 మెగావాట్ల విద్యుత్‌ను అందించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

ఇంకా కొనసాగుతున్న ఆటోస్టార్టర్ల వినియోగం

–తొలగింపునకు విస్తృత ప్రచారం

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా చేయడంలో రెండేళ్ల గడిచాయి. దీంతో రైతులు ఇప్పుడు నిరంతరంగా విద్యుత్ వాడుకుంటున్నారు. నూతన సంవత్సరం కానుకగా 2018 జనవరి 1వ తేదీ నుంచి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయడం ఆరంభించారు. 24 గంటల విద్యుత్ సరఫరాకు కోసం ఆ శాఖాధికారులు ప్రయోగాత్మకంగా అమలు చేసిన సమయంలో కొన్ని లోటుపాట్లను గుర్తించింది. ఇందులో ప్రధానమైనది రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను వినియోగం. రెండేళ్లయినా వీటి విషయంలో రైతులు పూర్తి స్థాయిలో తొలగించలేదు. ఈ దశలో అక్కడక్కడా ఎమ్మెల్యేలు, అధికారులు ఇంకా వీటిపై రైతులకు సూచనలు చేస్తూనే ఉన్నారు. పరిస్థితిని అధ్యయనం చేసిన తరవాత ఆటోస్టార్టర్ల వాడకాన్ని నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు ఆటోమేటిక్ స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగించాలని డిస్కం అధికారులు రైతులను కోరుతున్నారు. గతంలో విద్యుత్ సరఫరాలో నిరంతరం కలుగుతున్న అంతరాయంతో విసుగుపోయిన అన్నదాతలు ఆటోమేటిక్ స్టార్టర్ల వైపు మొగ్గు చూపారు. కరెంట్ వచ్చినప్పుడు, పోయినప్పుడు ఆటోమేటిక్ స్టార్టర్లు ఆన్, ఆఫ్ అయ్యేవి. దీనితో మాటి, మాటికి కలిగే ఇబ్బందుల నుండి రైతులకు కొంత వెసులుబాటు కలిగింది. దీనిని దృష్టిలో పెట్టుకునే రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. వ్యవసాయానికి 24 గంటల సరఫరాకు చేయడంతో రైతులకు ఆటోమేటిక్ స్టార్టర్ల అవసరం లేకుండా పోయింది. అందుకే రైతులు వినియోగిస్తున్న ఆటోమేటిక్ స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగిస్తే విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయాలను నియంత్రించవచ్చని డిస్కం అధికారులు సూచిస్తున్నారు. ఆటోమేటిక్ స్టార్టర్ల వినియోగం ప్రభావంగా గుర్తించిన అధికారులు వాటి నిషేదంపై దృష్టి సారించారు. రైతులే స్వచ్ఛందంగా ఆటో స్టార్టర్లను తొలిగించి టీఎస్ఎన్‌పీడీసీఎల్ సంస్థ అభివృద్ధికి తోల్పాటునందించాలని కోరుతున్నారు.

డబ్బు, మద్యంలదే ప్రధాన పాత్ర

–దీన్నే నమ్ముకున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్,జనవరి10(ఆర్ఎన్ఎ):మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో రాజకీయ వేడి అందుకుంది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఇప్పుడు అభ్యర్థుల దృష్టి అంతా ఓటర్లను తమవైపు ఎలా తిప్పుకోవాలి అనే దాంట్లో బీజీగా ఉన్నారు. ఇక చివరి రోజుల్లో ఓటర్ల చెంతకు నోట్లను చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుంటారు. ముందస్తుగానే నగదును ఆయా వార్డులకు చేర్చే పనిలో పడ్డారు. డబ్బులు, మద్యం పంచడం ద్వారా మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. దీంతో పురపోరు వేడి మున్సిపాలిటీల్లో రాజుకుంది. ఇప్పటికే టికెట్ వచ్చిన అభ్యర్థులు, టిక్కెట్ వస్తోందని ఎదురుచూస్తున్న ఆశవాహులు అందరూ ప్రచారాల్లో బీజీ బీజీగా తిరుగుతున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడేకొద్ది నాయకులు అంచెలంచెల వ్యూహాలతో ఆయా పార్టీల అభ్యర్థులు పంపకాల పర్వానికి తెరతీస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే ఎత్తులు వేస్తున్నారు. ఈ దఫా ఎన్నికల్లో మాత్రం అభ్యర్థులు బలంగా పడే ఓట్లను మాత్రమే కొనుగోలుకి ఆసక్తి చూపుతున్నారు. అందులో భాగంగానే తమ ఓటు వీళ్లని నమ్మిన వాళ్లకే డబ్బు చెల్లిస్తున్నారు. సర్వేలతో రెండు పార్టీల నాయకుల ఆయా బూత్‌ల వారీగా నిర్ధరించుకున్నారు. అభ్యర్థులు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు అభ్యర్థులు మద్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నట్లు సమాచారం. ఒకవైపు మద్యం అమ్మకాలు, తరలింపుపై భారీ స్థాయిలో నిఘా ఉండవచ్చని భావించే ముందుగానే కీలక అభ్యర్థులు భారీ స్థాయి రహస్య ప్రాంతాల్లో స్టాక్ చేసి పెట్టుకున్నట్లు సమాచారం. కొందరు నేరుగా ఇంటింటికి తిరిగి మద్యం బాటిల్స్ అందజేయాలని ప్లాన్ వేసుకుంటున్నారు. దీంట్లో యువత కీలక పాత్ర వహిస్తున్నారు బృందాలు ఏర్పడి ఆయా వార్డులలో ద్విచక్ర వాహనాల సాయంతో మద్యం తరలించే దాంట్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మొత్తంగా ఈ ఎన్నికల్లో ఈ రెండు కీలకం కానున్నాయి. అన్ని పార్టీల వారు ఇందుకు రంగం సిద్ధం చేశారు.

పూర్తిగా పట్టాలకెక్కని ఈ నామ్

నిజామాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): వ్యవసాయ మార్కెట్లలో దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ–నామ్ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఇంకా అస్తవ్యస్తంగానే ఉంది. సిబ్బంది కొరత, ఆన్ లైన్ వ్యవస్థ లోపాలు, కావలసిన ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఈ వ్యవస్థ భ్రష్టు పట్టి పోతుంది. ఈనామ్ వల్ల దేశంలో ఎక్కడి వ్యాపారులతో నైనా రైతులు కొనుగోళ్ల లావాదేవీలు జరుపుకోవచ్చు. ఫలితంగా రైతుకు గిట్టుబాటు ధర దక్కుతుంది. కేంద్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ప్రారంభించి ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో సక్రమంగా అమలు కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లలో 'ఈ–నామ్' వ్యవస్థను సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా స్థానిక వ్యాపారులు దానిని అమలు చేయకుండా చూస్తున్నారు. దీంతో ఎప్పటికిది అమలవుతుందో అన్న ఆందోళన ఉంది.

మున్సిపల్ వ్యూహాల్లో పార్టీలు

హైదరాబాద్, జనవరి 10:మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలను పార్టీలు సిద్ధం చేసుకుంటున్నాయి. అన్ని పార్టీలు తమదే గెలుపు అన్న ధీమాతో పావులు కదుపుతున్నాయి. అధికార టిఆర్ఎస్ మాత్రం తమ పథకాలు, కేడర్ వల్ల విజయం తమదే అన్న ధీమాలో ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకుంది. ఇక బిజెపి మాత్రం నరేంద్రమోడీ ప్రభుత్వ విధానాలు, తెలంగాణ అప్పులు,ఎంఐఎంతో టిఆర్ఎస్ జతకట్టడం వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా చేసుకునే యత్నాల్లో ఉంది. అంతేగాకుండా పౌరసత్వ చట్టంపైనా విపరీతంగా ప్రచారం తో ముందుకు సాగాలని చూస్తోంది. మొత్తంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయి. పార్టీ విజయాన్ని భుజాన వేసుకున్న వర్కింగ్ ప్రసిడెంట్ ఇప్పటికే గెలుపు వ్యూహాలను రచించారు. ఎక్కడెక్కడ ఎవరిని బరిలోకి దించేది మొదలు ప్రచార వ్యూహాలను కూడా ఖరారు చేశారు. ఆయనే ఈ ఎన్నికల్లో ప్రధాన ఆకర్షణ కానున్నారు. సిఎం కెసిఆర్ ఒకటి రెండు చోట్ల ప్రచారం చేస్తారని సమాచారం. మొత్తంగా అభివృద్ధి పేరుతో టిఆంఎస్..ప్రభుత్వ వ్యతిరేకతతో కాంగ్రెస్,బిజెపి తదితరపార్టీలు రంగంలోకి దిగబోతున్నాయి. దీనికితోడు విపక్ష పార్టీలు ఎవరికి వారే బరిలోకి దిగనుండడంతో అధికార పార్టీకి కలసి రానుంది. విపక్ష ఓట్లు చీలితే సహజంగానే టిఆర్ఎస్ లాభపడనుంది. అలాగే టిఆర్ఎస్‌లో టిక్కెట్లు పోటీ కూడా విపరీతంగానే ఉంది. అందుకే మున్సిపల్ ఎన్నికల బరిలో మనమే ముందున్నామని పార్టీ అధినేత కెసిఆర్ పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికల్లో మన పార్టీ ఘన విజయం ఖాయం అంటూ టానిక్ ఎక్కించారు. రాష్ట్రమంతా టీఆర్ఎస్‌కు సానుకూల వాతావరణం ఉన్నదని వారిలో ఆత్మస్థయిర్యం నింపారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు దక్కని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇతర అవకాశాలు కల్పిస్తామని సర్దిచెప్పాలని ఎమ్మెల్యేలు, పురపాలక సంఘాల ఇంచార్జీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులకు సూచించారు. టిక్కెట్ దక్కని వారికి భవిష్యత్‌లో వారికి ఎలాంటి అవకాశాలున్నాయో తెలుపాలని చెప్పారు. మార్కెట్ కమిటీ పదవులు, దేవాలయ కమిటీ పదవులు, పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇలా అనేక రకాలు ఉంటాయని, వీటిలో ఏదో ఒకటి ఇస్తామని వారికి భరోసా కల్పించాలని నిర్ణయించారు. అయితే ఏ పార్టీ కూడా ఖచ్చితంగా ఇప్పటి వరకు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రజా సమస్యలపై ఎలా పోరాడబోతున్నదీ స్పష్టంగా చెప్పలేకపోయింది. కాంగ్రెస్ పార్టీకి మాత్రం రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది. గెలిస్తే ఉంటారా లేదా అన్న బయం ఇప్పటి నుంచే వెన్నాడుతోంది. గతానుభవాల దృష్ట్యా బాండ్ రాయించుకునే స్థితికి ఆ పార్టీ వచ్చింది. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని ఇప్పటికే అన్ని పార్టీలు నిర్ణయించాయి. మున్సిపల్ ఎన్నికలు.. స్థానిక సంస్థల ఎన్నికలైనందున ట్రెండ్ ద్వారా ఓటింగ్ జరుగదు. ఈ విషయం అన్ని పార్టీలకు తెలుసు. అందుకే ప్రతి ఓటరును కలువాల్సిందేనని పార్టీ నేతలు నిర్ణయించారు. ఇకపోతే ప్రభుత్వ పథకాలను బాగా ప్రచారం చేయాలని సిఎం కెసిఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి ప్రభుత్వ పథక లబ్దిదారుడిని కలువాల్సిందేనని, ప్రభుత్వం పథకం ఇస్తుంది కాబట్టి ఓటు వేస్తారనుకోవద్దని కూడా హెచ్చరించారు. ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వ పథకాన్ని గుర్తుచేసి, మళ్లీ గెలిపిస్తే ఇంకా మంచి పథకాలు అమలు చేస్తామని చెప్పాలని, అప్పుడే ఓట్లు పడుతాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు తక్కువగా ఉంటాయి.. అభ్యర్థులు ఎక్కువగా ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రతి ఓటు విలువైనదే. అందుకే ఓటర్లకు ప్రాముఖ్యతివ్వాల్సిందే. మరో నాలుగేండ్లపాటు రాష్ట్రంలో ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, పట్టణాలను అభివృద్ధి చేసుకోవడానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తుందని టిఆర్ఎస్వర్గాలారంలో భాగం కానుంది. కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్లు, గురుకుల పాఠశాలలు ఇలా అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టామని, వాటన్నింటినీ లబ్దిదారులకు చేర్చామన్న ప్రచారం సాగనుంది. ఇకపోతే అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభ్యర్థులను గెలిపించడానికి నిత్యం సమీక్షలు, ప్రణాళికలు, వ్యూహం, ఎత్తుగడలతో ఏ విధంగానైతే తాను ముందుకెళ్లానో అదేవిధంగా ఎమ్మెల్యేలు కూడా చేయాలని కెసిఆర్ హితవు చెప్పారు. ఇకపోతే సీఎం కేసీఆర్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతా మన్న భయం పట్టుకుందని, అందుకే అడ్డదారిన అధికారంలోకి వచ్చేందుకు మంత్రులకు, ఎమ్మెల్యేలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి ఎలాగైనా గెలిచేందుకు సీఎం, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఎక్కడ ఓడితే అక్కడి మంత్రులను తొలగిస్తానని, ఎమ్మెల్యేలకు వచ్చేసారి టికెట్ ఇవ్వనంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని మోసం చేశారని, అయితే ప్రజలు తేరుకొని పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని అంటున్నారు. ఇవే ఫలితాలు రేపు మున్సిపాలిటీ ఎన్నికల్లో రాబోతున్నాయని పేర్కొన్నారు. మెజార్టీ మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయం ఖాయమన్న ధీమాలో ఉన్నారు. మొత్తంగా మున్సిపల్ ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి.

తెలంగాణ ప్రాజెక్టులతో మారనున్న దశ

ఒక్కో పథకానిది ఒక్కో మలుపు

శరవేగంగా సాగుతున్న పనులతో మారనున్న ముఖచిత్రం

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పాటు తరవాత ఒక్కో కార్యక్రమానిది ఒక్కో ప్రత్యేకత. ఇలా ఒక్కో కార్యక్రమం ముందుకు సాగుతున్న తీరు చూస్తుంటే తెలంగాణ పురోగమించడానికి ఎంతో దూరం లేదని అర్థం అవుతోంది. ఇవన్నీ సాకారం అవుతున్న వేళ అన్నింటికి మించి వ్యవసాయరంగం పురోభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తెలంగాణను వ్యవసాయికంగా ముందు నిలుపుతాయనడంలో సందేహం లేదు. ప్రాజెక్టులు పూర్తయితే సాగునీటి వనరులు అందుబాటులోకి రానున్నాయి. మూడు పంటలు సకాలంలో పూర్తి చేసుకునే అవకాశం వస్తుంది. సస్యవిప్లవం దిశగా తెలంగాణ వేస్తున్న అడుగులు శరవేగంగా పడుతున్నాయి. తీసుకుంటున్న చర్యలు సాకారం అవుతున్న వేళ భవిష్యత్‌లో తెలంగాణ వ్యవసాయకంగా పురోగమించడం కళ్లకు కనపడుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టుల కోసం సిఎం కెసిఆర్ పడుతున్న తపన, జరగుతున్న పనులు చూస్తుంటే గోదావరి, కృష్ణమ్మ గలగలలు తెలంగాణ మెట్ట భూములను తడపడం ఖాయంగా కనిపిస్తోంది. చేపట్టిన ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. అలాగే హరితహారంతో కోట్లాది మొక్కలు నాటారు. మిషన్ కాకతీయతో చెరువులకు మహర్దశ పట్టింది. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు రాబోతున్నది. విద్యార్థుల కోసం గురుకులాలు పెట్టారు. గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు చేపల పంపిణీ ఇలా చెప్పుకుంటూ పోతుంటే రాష్ట్రంలో ఒక్క ఎకరా కూడా మిగులకుండా మొత్తం వ్యవసాయ యోగ్య భూమికి సాగునీటి వసతికల్పించే లక్ష్యంతో ప్రాజెక్టులకు రూపకల్పనచేశామని ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన ప్రకటన దార్శనికతను ప్రతిబింబిస్తోంది. రాష్ట్రంలో రైతులు భవిష్యత్‌లో వర్షానికి ఎదురుచూసే పరిస్థితి రాకుండా సాగునీటి ప్రాజెక్టులతో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా కెసిఆర్ ప్రణాళిక రూపొందించారు. మరో ఏడాదిలో వివిధ ప్రాజెక్ట్ పనులు పూర్తి కావస్తున్న వేళ ఇక విమర్శలకు తావు లేదు. అనుకున్న ప్రాజెక్టులను అనుకున్నట్లుగా పూర్తి చేస్తున్న తీరు తెలంగాణ సంకల్పానికి నిదర్శనంగా నిలవనున్నాయి. వచ్చే వర్షాకాలంనుంచే వీలైనంత ఎక్కువగా గోదావరి జలాలను తీసుకునేందుకు కావాల్సిన అన్ని పనులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని సిఎం సూచించారు. ఇందుకోసం వాయువేగంతో పనులు జరుగాలని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పర్యటన వల్ల మరింత అవగాహన పెరిగిందన్న ముఖ్యమంత్రి.. కాళేశ్వరం ఎత్తిపోతల పనులను మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు పట్టుదలతో పనిచేయిస్తున్నారు. దీంతో గోదావరి బేసిన్ లోని అన్ని జిల్లాల్లో ఉన్న చెరువులు, కుంటలను యుద్ధ ప్రాతిపదికన నింపడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడా సాగునీరు అందని భూములను లేకుండా గోదావరి బేసిన్‌లోని నదులు, కాల్వలపై చెక్‌డ్యాంల ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని అదేశించారు. మానేరు రివర్‌లో నాలుగు నుంచి ఐదు, మూలవాగు రివర్‌లో రెండు నుండి మూడు వరకు, ఇంకా అవసరం ఉన్న చోట చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రణాళిక తయారుచేయాలన్నారు. ముందుగా దీనికి అవసరమయ్యే సర్వే చేయాలని అధికారులను అదేశించారు. దేవాదుల నుంచి వరంగల్ జిల్లా మొదలుకొని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ వరకు సాగునీటిని అందించాలన్న సంకల్పంయేరకు పనులు పూర్తి కావచ్చాయి. వ్యవసాయం తరువాత అతిపెద్ద వ్యాపారంగా చేపల పెంపకం నిలుస్తుంది. వచ్చే వానకాలం నుంచే వీలైనంత ఎక్కువగా గోదా వరి జలాలను తీసుకునేలా అన్ని పనులు సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి నీటిని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి నుంచి మేడారం వరకు మొత్తం 105 మీటర్ల ఎత్తుకు నీటిని తరలించడమే కీలక ఘట్టమని భావిస్తున్నారు. వచ్చే వానకాలంనుంచి గోదావరి నుంచి సాధ్యమైనంత నీటిని తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకు కావాల్సిన అన్ని పనులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. రోజుకు రెండు టీఎంసీల నీటిని గోదావరి నుంచి తీసుకొని ఒక టీఎంసీ నీటిని ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కింద వరదకాల్వ ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎత్తిపోయాలని, మరో టీఎంసీ నీటిని మిడ్‌మానేరుకు తరలించడానికి కావాల్సిన పనులు పూర్తిచేయాలని సూచించారు. భవిష్యత్‌లో వర్షానికి ఎదురుచూసే పరిస్థితి లేకుండా సాగునీటి ప్రాజెక్టులతో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. మొత్తంగా వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చూసే రోజులు దగ్గరపడ్డాయి. అనుకున్నపనులు పూర్తయితే తెలంగాణ ఆదర్శంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

ఎన్నికల పరిశీలకులు విధులు సమర్థంగా నిర్వర్తించాలి

నిర్మల్, జనవరి 10: మున్సిపల్ ఎన్నికల్లో పరిశీలకులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల సాధారణ పరిశీలకులు శృతి ఓజా, నిర్మల్ జిల్లా కలెక్టర్ ఎం. ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని సూక్ష్మ పరిశీలకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో శృతి ఓజా, ఎం. ప్రశాంతి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శృతి ఓజా మాట్లాడుతూ.. ఈ నెల 22న జరిగే మున్సిపల్ పోలింగ్ రోజున జరుగు ప్రతీ విషయాన్ని ఎప్పటికప్పుడు తమకు నివేదిక రూపంలో తెలియజేయాలన్నారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అదేవిధంగా పోలిం

సంక్రాంతి సెలవులతో మొదలైన ప్రయాణాలు

రైలు,బస్ స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ
ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ
ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలన్న పోలీసులు

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండుగ సెలవుఉల మొదలయ్యాయి. శనివారం రెండో శనివారంతో పాటు వరుస సెలవులు వస్తున్నాయి. దీనికితోడు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. అలాగే హైకోర్టుకు కూడా సంక్రాంతి సెలవులు ప్రకటించారు. దీంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పండగరద్దీ మొదలయ్యింది. సెలవులతో అంతా ఊరెళ్లేందుకు ప్లాన్ చేసారు. పండగ సంబురాలు జరుపుకునేందుకు నగరం నుంచి గ్రామ బాట పడుతున్నారు. పండుగకు సెలవులు ఉండడంతో కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరు గ్రామాలకు పయనమవుతారు. దీంతో నగరంలోని పలు కాలనీల్లో ఇళ్లకు తాళాలు పడనున్నాయి. ఇదే అదునుగా దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించే ప్రమాదం కూడా లేకపోలేదు. ఇళ్ల తాళాలు పగల గొట్టి అందినకాడికి దోచుకోవడం మనం ప్రతి ఏటా చూస్తున్నాం.

ఈ నేపథ్యంలో దొంగలబారిన పడకుండా ఉండేందుకు ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. సంక్రాంతి సెలవుల సమయంలో తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పోలీసు సూచనలు పాటించాలని రాచకొండ పోలీసులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా 'బీ కేర్ ఫుల్' అంటూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తు సరూర్‌నగర్, చైతన్యపురి పోలీసులు కరపత్రాలను కాలనీలలో పంపిణీ చేయడంతోపాటు ముఖ్య కూడళ్లు, జనరద్దీ ప్రాంతాల్లో గోడలకు కరపత్రాలను అంటిస్తూ అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. పోలీసు గస్తీ ఎలాగూ ఉంటుంది... దీనికి తోడు ఊళ్లకు వెళ్లే వారు పోలీసు సూచనలు పాటిస్తే చాలా వరకు దొంగతనాలను నివారించవచ్చుంటున్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లలో విలువైన వస్తువులు, నగదు పెట్టరాదని, నగదు, నగలు బ్యాంక్ లాకర్లలో దాచుకోవడం శ్రేయస్కరం అని హెచ్చరించారు. ఇంటి ముందు తలుపులకు బయట తాళం వేయకుండా కేవలం సెంటర్ లాక్ వేయాలన్నారు. ప్రధాన ద్వారం ముందు చెప్పులు ఉంచి, ఇంటి లోపల లైట్లు వేసి ఉంచితే ఇంట్లో జనం ఉన్నట్లుగా కనిపిస్తుంది.

ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దని, తాళం కనబడకుండా కర్టన్లు వేయాలన్నారు. ఊరికి వెళ్లే సమయంలో ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇవ్వాలి. అంతేగాకుండా ప్రతి రోజు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు. సెలవుల సమయంలో దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం కాలనీలలో ముందు జాగ్రత్తచర్యల గురించి వివరిస్తూ ఆటోల ద్వారా మైకుల్లో చెబుతున్నారు. దీంతో పాటు మఫ్టీ పోలీసు సిబ్బంది కాలనీల్లో ముమ్మరంగా గస్తీ చేపడుతున్నారు. దొంగతనాల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను వివరిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో రూపొందించిన సమాచారాన్ని సోషల్ నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు చేరవేస్తూ, వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఎప్పుడు వేళ్లేది..తిరిగి ఎప్పుడు వచ్చేది వివరాలు చెబితే ఆ ఇంటిపై పోలీసు నిఘాతోపాటు రాత్రి సమయంలో గస్తీ పెట్టడం జరుగుతుందన్నారు. .కాలనీల్లో అనుమానంగా సంచరించే వారి గురించి వెంటనే 100కు లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ఇండిపెండెంట్ గృహాలలో నివసించే వారు పోలీసుల ఫోన్ నెంబర్లు తమ వద్ద పెట్టుకుని పోలీసుల సహాయం తీసుకోవాలి.

సెలవు రోజుల్లో ప్రతి కాలనీలో గస్తీని అధికం చేస్తున్నాం. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను అధికం చేయడం, బీట్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడుపర్యవేక్షిస్తున్నారు.

రద్దీకి అనుగుణంగాప్రత్యేక బస్సులు

సంక్రాంతి రద్దీని ముందే ఊహించి టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ అధికార యంత్రాంగం 4,940 స్పెషల్ బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్, గౌలిగూడ సీబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్, ఎల్‌బీనగర్, లింగంపల్లి, చందానగర్, ఇసీఐఎల్, కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, టెలిఫోన్ భవన్, దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్ల నుంచి 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాలకే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, విజయనగరం, తెనాలి, గుంటూరు, గుడివాడ, రాజమండ్రి, కాకినాడ, రాజోలు, మచిలీపట్నం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, విశాఖపట్నం, శ్రీకాకుళం, భీమవరం, నర్సాపురం, కర్నూల్, అనంతపురం, కడప, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, ఉదయగిరి, కనిగిరి, కందుకూరు, పామూరు, పొదిలి తదితర ప్రాంతాలకు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల వైపు వెళ్లే షెడ్యూల్ బస్సులు, స్పెషల్ బస్సులు నడవనున్నాయి. ఉప్పల్ క్రాస్ రోడ్, ఉప్పల్ బస్‌స్టేషన్ నుంచి...యాదగిరిగుట్ట, జనగాం, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూర్, వరంగల్ వైపు వెళ్లే షెడ్యూల్ బస్సులు, స్పెషల్ బస్సులు నడవనున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్ నుంచి..మిర్యాలగూడ, నల్గొండ, కోదాడ, సూర్యాపేట వైపు వెళ్లే షెడ్యూల్ బస్సులు, స్పెషల్ బస్సుల నడవనున్నాయి. గౌలిగూడ సీబీఎస్ బస్‌స్టేషన్ నుంచి...కర్నూల్ వైపు, తిరుపతి, మాచర్ల, ఒంగోలు, నెల్లూరు వైపు, అనంతపురం, గుత్తి, పుట్టపర్తి, ధర్మవరం, మదనపల్లి వైపు వెళ్లే షెడ్యూల్ బస్సులు, స్పెషల్ బస్సులు నడవనున్నాయి.

ఇంటర్నెట్ కూడా ప్రాథమిక హక్కే

- పదేపదే 144 సెక్షన్ పెట్టడం అధికార దుర్వినియోగం చేసినట్లే
- జమ్ములో ఆంక్షలపై కేంద్రాన్ని తప్పుబట్టిన సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి10(ఆర్ఎన్ఎ) : జమ్ము, కశ్మీర్‌లో ఆంక్షలు విధించిన తీరుపై కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. అక్కడ ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అమలులో ఉన్న 144 సెక్షన్, ఇంటర్నెట్ నిలిపివేత వంటి నిర్ణయాలపై వారంలోగా రివ్యూ చేయాలని కశ్మీర్ యూటీని, కేంద్రాన్ని ఆదేశించింది. వాక్ స్వాతంత్ర్యం లాగే ఇంటర్నెట్ వాడుకునే వెసులుబాటు కూడా ప్రాథమిక హక్కేనని సుప్రీం అభిప్రాయపడింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో విధించిన ఆంక్షలను ఎత్తేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ ముగిసింది. శుక్రవారం ఉదయం అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. కేంద్రం ఆంక్షలు చట్టవిరుద్ధమని, కశ్మీర్‌లో ఉన్నఅన్ని రకాల ఆంక్షలపై వారంలోపు సమీక్ష చేయాలని ఆదేశించింది. కశ్మీర్ చాలా తీవ్రమైన హింసను చూసిందని, అయితే తాము శాంతి భద్రతల్ని పరిగణనలోకి తీసుకుని మానవ హక్కులను, ఫ్రీడం ఆఫ్ స్పీచ్‌ను బ్యాలెన్స్ చేయాల్సి ఉందని సుప్రీం కోర్టు చెప్పింది. జమ్ము కశ్మీర్‌లో 144 సెక్షన్, ఇంటర్నెట్ నిలిపివేత సహా ట్రావెల్ రిస్ట్రిక్షన్స్ వంటి ఆంక్షలు ఏమేం ఉన్నాయో అక్కడి ప్రభుత్వం ప్రచురించాలని, దీనిపై న్యాయపరంగా చాలెంజ్ చేసే అవకాశం కల్పించాలని సూచించింది. పదే పదే 144 సెక్షన్ పెట్టడం అధికార దుర్వినియోగమవుతుందని, భావాలను వ్యక్తపరిచే హక్కును హరించేలా దీన్ని వాడకూడదని చెప్పింది. హింస జరుగుతుందన్నప్పుడే ఈ సెక్షన్ పెట్టొచ్చని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం ఇంటర్నెట్ వాడుకునే వీలు అనేది ఫ్రీడం ఆఫ్ స్పీచ్ కిందకు వస్తుందని కోర్టు చెప్పింది. ప్రాథమిక హక్కులను ఇలా పూర్తిగా నిలిపివేయడమన్నది తప్పు అని, అత్యవసర పరిస్థితి ఉందంటేనే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలని వెల్లడించింది.

పల్లె ప్రగతి ద్వారానే గ్రామ స్వరాజ్యం

ముఖ్యమంత్రి కెసిఆర్ ముందుచూపుతో కార్యక్రమం
ప్రజలంతా బాధ్యతతో ముందుకు రావాలి
పలుగ్రామాల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్ పాటిల్

వరంగల్ అర్బన్,జనవరి 9(ఆర్ఎన్ఎ): పల్లె ప్రగతి ద్వారానే గ్రామ స్వరాజ్యం వస్తుందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అన్నారు. రెండో విడత ప్లలె ప్రగతి కార్యక్రమంలో బాగంగా గురువారం భిందేవరపల్లి మండలంలోని మల్లారం వీర్లగడ్డ తండా, కోతకొండ ధర్మారం గ్రామాలలో పలురకాల పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు దిశ నిర్దేశం చేశారు. గ్రామాభివృద్ధికి కోసం వివిధ పనులను చేపట్టేందుకు నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పల్లె ప్రగతి కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ముందుచూపుతో ప్రవేశ పెట్టారని ఈ పథకంలో అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఏలాంటి భాధ్యతలు ఉన్నాయో గ్రామాభివృద్ధి కోసం ప్రజలకు కూడా కొన్ని బాధ్యతలను అప్పగించారని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఇంటింటికీ ఇంకుడు గుంతలు మొక్కల పెంపకం లాంటి భాధ్యతలను ప్రజలు చేయలని గ్రామాభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తేనే ముఖ్యమంత్రి ఆశయం నెరవేరుతుందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ఇంత ప్రాధాన్యత చూరవ చూపలేదని తెలంగాణ రాష్ట్రం లోనే అమలు చేస్తున్నారని అందుకు మనమందరూ వచ్చిన అవకాశాన్ని రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి మన గ్రామం ను అన్ని గ్రామాల కంటే అభివృద్ధి లో ముందుండ లనే సంకల్పం తో ఆరోగ్యకరమైన పోటీతత్వం తో సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు నందించలని చెప్పారు గ్రామాభివృద్ధికి అన్ని పనులకూ ప్రభుత్వం ద్వారా సాధ్యం కాదని గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతంలో ఉన్నత ఉద్యోగం గాని వ్యాపార వాణిజ్య రంగంలో ఇతర రంగంలో ఆర్థికంగా ఉన్న వారి వద్ద నుండి గ్రామ అభివృద్ధికి సహాయం చేయాలని కోరారని ప్రజలకు సూచించారు.ముందుగా భీందేవర పల్లి మండలంలోని మల్లారంలో నర్సరీలో చేతి పంపు, శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సూల్‌పూర లో వైకుంఠ దానికి ప్రహరీ గోడ నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ ను ఆదేశించారు.

రెండు నెలల్లో ఇంకుడు గుంతలు వైకుంఠ దామా లు పూర్తి చేయాలనీ ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా మల్లారం జి పి కి కొనుగోలు చేసిన ట్రాక్టర్ ను స్పెషల్ కలెక్టర్ మను చౌదరి ప్రారంభించి కొద్ది దూరం నడిపారు. పీర్లగడ్డ తండాలో అవెన్యూ ఎ÷-లాంటేషన్ పరిశీలన మండలంలో చిన్న జి పి లలో మినీ ట్రెయిలర్ లేదా ఆటో ట్రెయిలర్ కొనుగోలు చేయాలని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు,

÷-రైమరీ పాఠశాల లో ఉపాధ్యాయుడు లేక విద్యార్థులకు చదువు చెప్పే వారు లేనందున ఉపాధ్యాయుని నియమించాలని గిరిజనులు కోరారు కనీసం వచ్చే విద్యా సంవత్సరం లో ప్రారంభం చేయాలి కోరగా కనీసం 20 మంది విద్యార్థులు ఉంటేనే ఉపాధ్యాయున్నీ నియమిస్తామని చెప్పారు పాఠశాల అవరణాలో మొక్కలు నటినందున వాటికి నీరు పోసెందుకు చేతి పంపు మంజూరు చేయాలని గిరిజనులు కోరిన వెంటనే అంచనా ప్రతిపాదనలు పంపించాలని ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు.ఇంటింటికీ చెత్త సేకరణ చేయాలి 20 రోజుల్లో వైకుంఠ దమం నిర్మాణ పనులను పూర్తి చేయానీ ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా స్మశనవాటిక అవరనాలో మొక్కలు నాటారు. ధర్మారం లో 100 శాతం ఇంకుడు గుంతలు పూర్తి చేస్తే నగదు ప్రోహత్సకం అందిస్తామని అన్నారుపాఠశాల లో మరో ఉపాధ్యాయునికి నియమించాలి , నూతన జి పి బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని గ్రామం నుండి స్మశాన వాటిక వరకు సి సి రోడ్డు మరియు విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ కలెక్టర్ కు విన్నవించారు గ్రామం నుండి వైకుంఠ దమాం వరకు ఫర్మేశన్ రోడ్డు రైతులు అడ్డంకులు సృష్టిస్తున్నారనీ నక్ష ప్రకారం హద్దులు నిర్ణయించాలని కలెక్టర్‌ను సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి మండల ప్రత్యేక అధికారి ఎంపీడీఓ సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు పంపిణీ చేసిన ట్రాక్టర్‌ను నడిపిన వరంగల్ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్

ఆర్థికవేత్తలతో ప్రధాని మోడీ భేటీ

బడ్జెట్ రూపకల్పనకు ముందే చర్చలు
ఆర్థిక మందగమనం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం

న్యూఢిల్లీ,జనవరి10(ఆర్ఎన్ఎ): బడ్జెట్ సమావేశాలపై ప్రధాని మోడీ దృష్టి సారించారు. అలాగే ఆర్థిక మందగమనం నేపథ్యంలో బడ్జెట్ విధివిధానాలపై దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తల సలహాలను కోరారు. గురువారం నీతి ఆయోగ్ భవన్‌లో జరిగిన భేటీలో దేశానికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్తలతో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. ఇందులో మంత్రులు అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. అమూల్యమైన సలహాలు ఇవ్వాలని ప్రధాని వారిని కోరారు. అలాగే ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. ఇదిలావుంటే ఆర్థిక అభివృద్ధికి సంబంధించి రానున్న బ్జడెట్‌లో ప్రజల డిమాండ్లు, ఆకాంక్షలకు తగ్గట్టు ఎటువంటి అంశాలు ఉండాలో ప్రజలు నేరుగా సూచనలు పంపాలని ప్రధాని నరేంద్రమోడీ బుధవారం అభ్యర్థించారు. ఒక మోస్తరు దేశ ప్రగతి 5 శాతం వరకు ప్రభుత్వం ఆశిస్తున్న నేపథ్యంలో ప్రధాని బ్జడెట్ రూపకల్పనలో ప్రజల అభి ప్రాయాలను కోరడం ఈ సందర్భంగా గమనార్హం. కేంద్ర బ్జడెట్ 130 కోట్ల భారతీయుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని, దేశ అభివృద్ధి పథానికి మార్గం చూపిస్తుందని అందుకని మీ అందరి ఆలోచనలు, ప్రతిపాదనలు స్వాగతిస్తున్నానని ప్రధాని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి ఈ సూచనలన్నిటినీ పరిశీలించి వచ్చే బ్జడెట్ ప్రవేశ పెడతారని ఆయన వివరించారు.

నిర్మలా సీతారామన్ ఎక్కడ?

కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే బ్జడెట్‌పై చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ముఖ్య ఆర్థికవేత్తలతో భేటీ అయ్యారు. బ్జడెట్ రూపకల్పన, నిధుల కేటాయింపు, ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి అంశాలపై వారు చర్చించే అవకాశం ఉంది. ఈ భేటీలో మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, పియూష్ గోయల్, నీతిఆయోగ్ ప్రతినిధులు, పలువురు ఆర్థికవేత్తలు పాల్గొన్నారు. అయితే బ్జడెట్ రూపకల్పన చర్చించే ఈ భేటీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. దీనిపై కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ట్విటర్ వేదికగా స్పందించారు. కీలకమైన సమావేశానికి ఆర్థికమంత్రి లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. అసలిక్కడ ఏం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కాగా ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2019-20 ఏడాదికి బ్జడెట్ ను ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే.

2022లో కొత్త పార్లమెంట్ భవనం

ఇదిలావుంటే 2022లో 75వ దేశ స్వాతంత్య్ర వార్షికోత్సవాల సందర్భంగా పార్లమెంటు సమావేశాలు కొత్త భవనంలో జరుగుతాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బుధవారం వెల్లడించారు. నవభారత్ స్వప్నం నెరవేరేందుకు భారత పార్లమెంటు 2022లో సమావేశాలు కొత్త పార్లమెంటు భవనంలో నిర్వహిస్తుందని చెప్పారు. కెనడా లోని ఒట్టావాలో 25 వ కాన్ఫరెన్సు ఆఫ్ స్పీకర్స్, అండ్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ఆఫ్ ది కామన్‌వెల్తు (సిఎస్‌పిఒసి) సదస్సులో స్పీకర్ మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంటు భవనం 1927 నుంచి సమావేశాలు నిర్వహిస్తోందని, ఇప్పటికి 92 సంవత్సరాలు పూర్తయ్యాయని బిర్లా వివరించారు. రాష్ట్రపతి భవనం నుంచి ఇండియా గేట్ వరకు సెంట్రల్ విస్తా పునరుద్ధరణ మరో 250 సంవత్సరాల అవసరాల మేరకు చేపట్టడమవుతోందని చెప్పారు.

ఎపి రాజధానుల విషయం మా దృష్టిలో లేదు

పౌరసత్వ చట్టం బిల్లు ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదు
మోడీది సంస్కరణల పథం: కిషన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేసే ఆలోచన కేంద్రానికి లేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.ఏపీకి మూడు రాజధానుల అంశం ఆ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని అన్నారు. రాజధాని తరలింపుపై సరైన సమయంలో కేంద్ర ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. మూడు రాజధానుల అంశం తమ దృష్టికి రాలేదని కిషన్ రెడ్డి అన్నారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రం ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాని ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వలేదన్నారు. ఈ అంశం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది అని అన్నారు. భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. గత ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందాలను గౌరవించాలని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)లో ఒక్క అక్షరం తప్పున్నా మార్చడానికి సిద్ధమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శరణార్థులను ఆదుకోవడానికే సీఏఏను తీసుకొచ్చినట్లు చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం ఏ ఒక్క మతం, కులం, వర్గానికి వ్యతిరేకం కాదని వివరించారు. పౌరసత్వ సవరణ చట్టంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. నరేంద్రమోదీది సంస్కరణల ప్రభుత్వమని కొనియాడారు. ఈ నెలలో జమ్ములో కేంద్రమంత్రులు పర్యటిస్తారని, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఇన్వెస్టర్ల సమావేశం జరుగుతుందన్నారు. సీఏఏ బిల్లు వల్ల ఏ ఒక్కరు ఇబ్బంది పడినా.. బిల్లును మార్చడానికి వెనుకాడమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌కు వచ్చిన వారికే పౌరసత్వం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఐదేళ్లలో ప్రధాని మోదీ నీతివంతమైన పాలన అందించారని తెలిపారు.

జపాన్ కుబేరుడు మేజావా సంచలన నిర్ణయం

అనుచరులకు రూ.64కోట్లు నగదు పంపిణీ

టోక్యో,జనవరి10(ఆర్ఎన్ఎ)జపాన్ కుబేరుడు, ఫ్యాషన్ డిజైన్ ఇండస్ట్రీ దిగ్గజం యుసాకు మేజావా సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ఫాలోవర్స్‌కి ఏకంగా రూ. 64.36 కోట్లు పంచిపెట్టడం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఇలాంటి నిర్ణయం ఎందుకో తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సోషల్ మీడియాలో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిన ఆయన తన ట్విటర్‌లో అనుచరులు వెయ్యి మందికి ఈ నగదును పంచిపెట్టనున్నారు. 6.8 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్న యుసాకు మేజావా జనవరి 1వ తేదీన ట్విటర్‌లో తన పోస్ట్‌ను రీట్వీట్ చేసిన వెయ్యి మంది ఫాలోవర్స్‌ను ఎంపిక చేసి వారికి 9 మిలియన్ డాలర్లు (సుమారు రూ.64.36 కోట్లు) అందజేయనున్నామని ప్రకటించడం విశేషం. జపాన్ లో రెండవ అతిపెద్ద షాపింగ్ సంస్థ జోజో ఇంక్ వ్యవస్థాపకుడైన యుసాకు చేసిన ఈ ట్వీట్ రికార్డు స్థాయిలో 3.8 మిలియన్ల షేర్లను సాధించింది. 9 లక్షలకుపై పైగా లైక్‌లు కొట్టేసింది. అంతేకాదు జనవరి 7 నాటికి అత్యధిక సార్లు రీట్వీట్ అయిన ట్వీట్‌గా నిలిచింది. యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (బీఐ) భావనను నిశితంగా అర్థం చేసుకోవడంలో భాగమే ఈ ప్రయత్నమని యుసాకు మేజావా ట్విటర్‌లో వివరించారు. తాను పెద్ద రాజకీయ నాయకుడిని కానందున ప్రజల కనీసం ఆదాయంపై ఇంతకుమించి తానేమీ చేయలేనని వరుస ట్వీట్లలో చెప్పుకొచ్చారు. అంతేకాదు జపాన్ ప్రభుత్వం, కనీస ఆదాయ పథకాన్ని...అంటే ప్రతి నెలా పౌరులకు నిర్ణీత మొత్తాన్ని చెల్లించే ఒక విధానం ప్రవేశ పెట్టవలసిన అవసరాన్ని వివరించారు. మరోవైపు అమెరికా అధ్యక్ష అభ్యర్థి ఆండ్రూ యాంగ్ ఇలాంటి పథకాన్ని ఎన్నికల సందర్భంగా ప్రకటించారు. తాను ఎన్నికైతే 18 ఏళ్లలోపు ప్రతి వయోజన అమెరికన్‌కు నెలకు వెయ్యి డాలర్లు ఇస్తానని వాగ్దానం చేశారనీ, ఆయననే యుసాకా ఫాలో అయ్యారని పలువురు నెటిజన్లు వ్యాఖ్యానించారు. కాగా మేజావా ఇటీవల 2023లో ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్‌లో చంద్రయానానికి సంతకం చేసిన మొదటి ప్రైవేట్ ప్రయాణీకుడిగా వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే.

ప్లాట్‌ఫామ్ టిక్కెట్ల ధరల పెంపుపై ప్రయాణికుల అభ్యంతరం

హైదరాబాద్,జనవరి 10(ఆర్ఎన్ఎ):సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్‌లలో రద్దీని నివారించడానికి ప్లాట్‌ఫారం టికెట్ ధరను రూ. 10 నుంచి రూ. 20కి పెంచాలని దక్షిణమధ్య రైల్వే యంత్రాంగం నిర్ణయిం చింది. దీనిని ప్రయాణికులు తప్పుపట్టారు. పండగ సమయాల్లో ఇలా చేయడం సరికాదన్నారు. సంక్రాంతి పండుగకు నగరం నుంచి తెలుగు రాష్ట్రాలలోని ఆయా పట్టణాలు, నగరాలు ఇతర రాష్ట్రాలకు లక్షలాది మంది ప్రయాణీకులు బయలు దేరుతుండడంతో సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ప్రయాణికేతరులు రైల్వేస్టేషన్‌లలోకి రాకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ప్లాట్‌ఫాం టికెట్ ధర పెంపు ఈనెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమలులో ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఢిల్లీలో పొగమంచుతో ఆలస్యంగా రైళ్ల రాక

న్యూఢిల్లీ,జనవరి 10(ఆర్ఎన్ఎ): దేశరాజధాని ఢిల్లిలో భారీగా పొగమంచు కమ్మేసింది. గత కొన్నిరోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు పొగమంచుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పొగ కమ్మేయడంతో కొద్ది దూరం కూడా స్పష్టంగా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఢిల్లికి రావలసిన పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. కనీసం 21 రైళ్లు గంటనుంచి ఆరు గంటల ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే శాఖ చీఫ్ పిఆర్ఒ చెప్పారు. ఆలస్యంగా నడుస్తున్న రైళ్ల జాబితాను ఆయన విడుదల చేశారు.

ఆర్థికవ్యవస్థను కోల్డ్‌స్టోరేజీలో పెట్టారు

-ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ,జనవరి10(ఆర్ఎన్ఎ) : దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దృష్టిసారించడం లేదని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర విమర్శలు చేశారు. తయారీ, నిర్మాణ రంగాల్లో క్షీణత వల్ల జీడీపీ వృద్ధి 11సంవత్సరాల కనిష్ఠానికి పడిపోతుంటే కేంద్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ఆమె దుయ్యబట్టారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే విషయంపై దృష్టి పెట్టాల్సిన బిజెపి ప్రభుత్వం దాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టిందని దుయ్యబట్టారు. 'ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగోలేదని దేశ స్థూల జాతీయోత్పత్త(జీడీపీ) అంచనాలు వెల్లడిస్తున్నాయి, కానీ, దాని గురించి కేంద్రానికి ఎటువంటి భయం లేదు. దీని ప్రభావం పేదలు, రోజువారీ కార్మికులపై పడనుంది' అని ప్రియాంక గాంధీ ట్వీట్ చేశారు. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కేంద్రం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. ఆర్థిక మందగమనం

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో నిర్మల్‌లో పలువురు టిఆర్ఎస్‌లో చేరిన దృశ్యం

ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలే తెరాసను గెలిపిస్తాయి
- అన్నివర్గాల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశాం
- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- మంత్రి అల్లోల సమక్షంలో టీఆర్ఎస్‌లో భారీ చేరికలు

నిర్మల్, జనవరి10(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రజలంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని, అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఆ పథకాలే మున్సిపాలిటీ ఎన్నికల్లో తెరాస అభ్యర్థులను గెలిపిస్తాయని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ మున్సిపాలిటీలోని శాస్త్రినగర్ లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో పలు పార్టీల నుంచి టీఆర్ఎస్ లో చేరారు. నిర్మల్ పట్టణ కాంగ్రెస్ నేతలు అడప పోశెట్టి, పద్మాకర్, రామలింగం, జొన్నల మహేశ్, జనార్ధన్, చందు చరణ్ ఆధ్వర్యంలో వందల మంది కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. మంత్రి అల్లోల వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలన. అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, షాదీ ముబారక్ లాంటి పథకాలతో ప్రజలు ఆకర్షితులై టీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వికలాంగులకు పెన్షన్, వృద్ధులకు ఆసరా పెన్షన్, రైతుబంధుతో పాటు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనసు గెలుచుకున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. నిర్మల్ పట్టణంలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కోట్లాది రూపాయల నిధులతో గతంలో ఎన్నడూ లేనివిధంగా నిర్మల్ పట్టణాన్నిఅభివృద్ధి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఇంతకు రెట్టింపు పనులను చేయడానికి కృషి చేస్తామని మంత్రి హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు మారుగొండ రాము, రాంకిషన్ రెడ్డి, గంప్రత్ ఈశ్వర్, ధర్మాజీ రాజేందర్, అయ్యన్నగారి రాజేందర్, రామేశ్వర్ రెడ్డి మల్లికార్జున్ రెడ్డి, భూషణ్ రెడ్డి, అల్లోల గౌతంరెడ్డి, ముత్యంరెడ్డి, హరీష్ రావు, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లంచంగా గేదెను అప్పగించిన మహిళ

మధ్యప్రదేశ్‌లో రెవెన్యూ అధికారుల షాక్

భోపాల్,జనవరి10(ఆర్ఎన్ఎ): లంచం అడిగిన తహసీల్దార్‌కు ఓ మహిళ ఊహించని షాక్ ఇచ్చింది. లంచంగా తన ఇంటిలో ఉన్న గేదెను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. నౌధియా గ్రామానికి చెందిన రాంకలీ పటేల్ అనే మహిళ ..పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిని తన పేరు మీద మ్యుటేషన్ చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పని కావాలంటే రూ. 10వేలు లంచం ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయ అధికారులు అడిగారు. దీంతో నదరు మహిళ అప్పు చేసి మరీ రూ. 10వేలు లంచం అప్పజెప్పింది. అయినప్పటికీ ఆమె పని కాలేదు. కొద్దిరోజుల తర్వాత మరోసారి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి ఆరా తీసింది. ఇంకా పని కాలేదని, మ్యుటేషన్ చేయాలంటే మరో రూ. 10వేలు లంచంగా ఇవ్వాలన్నారు. లంచం ఇచ్చేందుకు డబ్బులు లేకపోవడంతో తన గేదెను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చింది. లంచంగా తన గేదెను తీసుకొని తన పేరుపై మ్యుటేషన్ చేయాలని కోరింది. లంచం అడిగిన విషయం అందరికీ తెలియడంతో తహసీల్దార్ అధికారులు ఆందోళన చెంది.. అసలు నిన్ను లంచం ఎవరు అడిగారు అంటూ ఆ మహిళపై కోపగించుకున్నారు. అంతేకాదు నాలుగు రోజుల కిత్రమే మహిళ పేరున మ్యుటేషన్ చేశామని , తమను అల్లరి చేసేందుకే మహిళ కుట్ర పన్ని కార్యాలయానికి గేదెను తెచ్చిందని ఎమ్మార్వో వివరణ ఇచ్చారు. కాగా, మహిళపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామని ఎమ్మార్వో కార్యాలయ అధికారులు తెలిపారు.

శిల్పారామంలో సంక్రాంతి శోభ

హాజరైన వెంకయ్య, ఇరు రాష్ట్రాల గవర్నర్లు

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): నగరంలోని శిల్పారామం సంక్రాంతి శోభను సంతరించుకుంది. గురువారం శిల్పారామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబంతో కలిసి పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబంతో పాటు గవర్నర్ తమిళిసై, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, మురళీమోహన్, సుజనాచౌదరి, పరిటాల శ్రీరామ్, అశ్వినీదత్, హీరో వెంకటేశ్, హీరో మహేశ్ బాబు, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ రామచంద్రరావు హాజరయ్యారు. సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో వారసులను ప్రోత్సహించనన్నారు. వారసత్వం అనేది సేవలో ఉంటే చాలని ఆయన వ్యాఖ్యానించారు. ముప్పవరపు ఫౌండేషన్ పేరుతో అవార్డులు ఇస్తామంటే వద్దన్నానని చెప్పారు. తాను వెళ్లిపోయాక తన పేరు మీద అవార్డు ఇవ్వమని చెప్పానన్నారు. తనకు వ్యాపాలపై ఆసక్తి లేదని చెప్పారు. తన ఆస్తులను వారసులకు కూడా ఇవ్వనని, స్వర్ణభారత్ ట్రస్ట్‌కి ఇస్తానని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

తాను సాధారణ స్థాయి నుంచి ఉపరాష్ట్రపతి స్థాయి వరకు వెళ్లానని.. నాకు వేరే ఆశలు లేవన్నారు. శిల్పారామంలో గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చురకుగా మేడారం జాతర ఏర్పాట్లు

పనులను త్వరగా పూర్తి చేయాలన్న కలెక్టర్
ప్రత్యేక బస్సులను నడపనున్న ఆర్టీసీ

వరంగల్,జనవరి10(ఆర్ఎన్ఎ): రెండేళ్లకోమారు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు ప్రముఖులు రానుండడంతో ఏర్పాట్లుచే చురుకుగా సాగుతున్నాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. జాతర ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మేడారంలో వివిధ శాఖలు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పనులు పురోగతిలో ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆధునిక గుడారాలను జాతరకంటే ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. స్నానఘట్టాల వద్దకు వెళ్లి అక్కడ జరుగుతున్న ఇసుక చదును, షవర్ల పనిచేసే విధానంపై ఆరా తీశారు. స్నానఘట్టాలు, భక్తులు విడిది చేసే ఇతర ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగింపు గురించి అడిగితెలుసుకున్నారు. ఇకపోతే వివిధ డిపోలకు చెందిన ప్రత్యేక బస్సులను నడిపేందుకు తెలంగాణ ఆర్టీసీ సిద్ధమైంది. అవసరాన్ని బట్టి మరో 200 బస్సులు అదనంగా నడిపేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఆయా ప్రాంతాల నుంచి నడిపే సర్వీసుల ఛార్జీలనూ ఖరారు చేసింది. అలాగే మేడారం జాతర అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడేది లేదని ములుగు ఇన్‌చార్జి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిపివేయాలని, ఇప్పటికే చెల్లించిన బిల్లులను రికవరీ చేయాలని ఆదేశించారు. సారలమ్మ ప్రవేశ ద్వారం నుంచి కన్నెపల్లి వరకు నిర్మించిన రోడ్డు పనులను చూశారు. అధికారులు సరైన పర్యవేక్షణ చేయాలని, కాంట్రాక్టర్లు ఇష్టాంజ్యంగా పనులు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగంలోకి రాకుండా చేసి పరువు తీయొద్దని ఈఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకొని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించేం దుకు క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంతో పాటు విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేసి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేసి జాతర విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. గద్దెల పరిసరాలతో పాటు చిలకలగుట్ట, శిరంసాగర్ చెరువు, కొంగలమడుగు, జంపన్నవాగు, ఊరట్టం, కన్నెపల్లి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతర పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించాలని సూచించారు.

ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జనవరి10(ఆర్ఎన్ఎ): అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ముగ్గురు డిగ్రీ విద్యార్థినులు నిద్ర మాత్రలు మింగి గురువారం ఆత్మహత్యాయత్నం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు వారి అవసరాల నిమిత్తం నగరానికి చెందిన మహేశ్ అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ. 20 వేలు అప్పు తీసుకున్నారు. వడ్డీ వ్యాపారి నుంచి వత్తిళ్లు అధికమవడంతో బుధవారం రాత్రి ముగ్గురు విద్యార్థినులు తమ ఇళ్ల నుంచి అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. చికిత్స కోసం వారిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ బాషా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్ ఛాలెంజ్ కు ప్రజలు సహకరించాలి: ఎంపీ రఘురాం కృష్ణంరాజు

హైదరాబాద్,జనవరి 10:: ఆంధ్రప్రదేశ్ ఎంపీ రఘురాం కృష్ణంరాజు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని..మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన హరితహారంలో భాగంగా..ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టడం చాలా మంచి కార్యక్రమమని అన్నారు.

గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన ఎపికి చెందిన వైకాపా ఎంపి రఘురామ కృష్ణంరాజు

మొక్కలు లేనిది మానవాళి లేదు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఒక్క మహత్తర ఉద్యమంగా మారి బంగారు తెలంగాణలో భాగంగా హరిత తెలంగాణ, ఆకుపచ్చని తెలంగాణగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతో తెలంగాణ చక్కటి, పచ్చటి తెలంగాణ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎంపీ రఘురాం కృష్ణంరాజు అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరి సహకారం ఉండాలని కోరారు. హీరో బాలకృష్ణ, సినీ నిర్మాత అశ్విన్ దత్, మాజీ క్రికెట్ ప్లేయర్ చాముండేశ్వర్ నాథ్ కు నేను గ్రీన్ ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు.

మేడారం జాతరకు విస్తృతంగా బస్సులు

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): మేడారం జాతర కోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి మేడారం జాతరకు వచ్చే బస్సు ఛార్జీలు క్రింది విధంగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి మేడారం జాతరకు రూ. 440, జనగామ నుంచి మేడారం జాతరకు రూ. 280, మహబూబాబాద్ నుంచి మేడారం జాతరకు రూ. 270, కాళేశ్వరం నుంచి మేడారం జాతరకు రూ. 260, వరంగల్ నుంచి మేడారం జాతరకు రూ. 190 బస్సు ఛార్జీలు ఉంటాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న మేడారం జాతరకు వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ నుంచి నాలుగు వేల బస్సులను నడుపనున్నట్లు చెప్పారు. నాలుగు వేల బస్సులతో సుమారు 23 లక్షల మంది భక్తులను చేరవేసేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఆర్టీసీ నుంచి ఈసారి 12500 మంది విధుల్లో ఉంటారని, వీరిలో అధికారులు, సిబ్బంది ఉన్నారని తెలిపారు. మేడారం బస్‌స్టేషన్ వద్ద సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తామని వివరించారు.

పర్వతారోహకుడు అఖిల్‌కు గవర్నర్ ప్రశంసలు

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): లడఖ్‌లోని స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించిన వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ వాసి రాసమల్ల అఖిల్‌ను గురువారం హైదరాబాద్ రాజభవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర రాజన్ అభినందించారు. చైనా సరిహద్దు లడఖ్‌లోని 6154 మీటర్ల ఎత్తైన స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని గత ఏడాది ఆగష్టు 15వ తేదీన అధిరోహించి 365 అడుగుల జాతీయ జెండాను ఎగురవేసి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అఖిల్ అందుకున్నారు. గతంలో 97 అడుగుల జాతీయ జెండాను ఎగురవేసిన రికార్డును అఖిల్ అధిగమించాడు. ఇటీవల గవర్నర్ ఆదేశాల మేరకు అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ ప్రోత్సహంతో అఖిల్ యూత్ రెడ్ క్రాస్‌లో సభ్యత్వం తీసుకున్నాడు.

ఈ నేపథ్యంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించిన తెలంగాణ రెడ్ క్రాస్ యాప్ పై రాజభవన్ లో జరిగిన రెడ్ క్రాస్ సొసైటీ అవగాహనా కార్యక్రమానికి అఖిల్ హాజరయ్యాడు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అయన రాష్ట్ర గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అఖిల్ ధైర్య సాహసాలను గవర్నర్ ప్రశంశించారు. రెడ్ క్రాస్ సేవలు , రక్త దానంపై యువతలో విస్తృత అవగాహన కలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ నేషనల్ మేనేజింగ్ కమిటీ సభ్యులు డా.పి.విజయచందర్ రెడ్డి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్వర్ రెడ్డికి హరీష్ రావు పరామర్శ

హైదరాబాద్,జనవరి10(ఆర్ఎన్ఎ): అస్వస్థతకు గురైన రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి హరీష్ రావు, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరామర్శించారు. బంజారాహిల్స్ లోని మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి జగదీష్ రెడ్డి నివాస గృహానికి వెళ్లిన వారు మంత్రి జగదీష్ రెడ్డిని కలసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు గాధారి కిశోర్ కుమార్, ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ ప్రభాకర్ రావు మంత్రిని పరామర్శించారు. సూర్యపేట జిల్లా ప్రజాపరిషత్ వైస్ చైర్మన్ గోపాగాని వెంకట్ నారాయణ గౌడ్, జెడ్పీటీసీ మేడి బిక్షం, ఎంపీపీ నేమ్మాది బిక్షం మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వై.వెంకటేశ్వర్లు తదితరులు తరలి వచ్చి మంత్రిని పరామర్శించారు.

జగిత్యాల అభివృద్ధికి కృషి

గులాబీ జెండా ఎగరడమే లక్ష్యం : ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల,జనవరి10(ఆర్ఎన్ఎ): రాజకీయాలకు అతీతంగా జగిత్యాల నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తాను గత ఐదేళ్లగా ఎమ్మెల్యేగా లేకున్నా ఈ ప్రాంత అభివృద్ధికి మాజీఎంపి కవిత సహకారంతో ముందుకు సాగుతున్నానని అన్నారు. ఆమె ఇచ్చిన స్ఫూర్తితో అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడిగా అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగరాలన్నారు. పట్టణాల అభివృద్ధికి సిఎం కెసిఆర్ పట్టుదలతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకు చేకూరేలా కృషి చేస్తున్నారన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో దాదాపు 95శాతం భూ సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. చెరువుల శిఖం భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బడుగు బలహీన వర్గాలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.

లైంగిక వేధింపుల కేసులో ట్విస్ట్

ఆరోపణలు చేసిన బాలిక అదృశ్యం
ఆందోళనలో కుటుంబ సభ్యులు

ముంబయి,జనవరి10(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ)పై లైంగిక ఆరోపణలు చేసిన బాలిక(17) కనిపించకుండా పోయింది. 17 ఏండ్ల బాలిక లైంగిక ఆరోపణలపై చర్యలు తీసుకుంటూ పోలీసులు గతేడాది డిసెంబర్ 26న డీఐజీ నిషికాంత్ మోర్‌పై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు గడిచిన గురువారం నాడు డీఐజీని విధుల నుంచి సస్పెండ్ చేశారు. కాగా ఫిర్యాదుదారు, బాధిత బాలిక తాజాగా అదృశ్యమైంది. ఆత్మహత్య లేఖ రాసి ఇంట్లోంచి వెళ్లిపోయినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక గడిచిన సోమవారం నాడు కాలేజీకి వెళ్లింది. ఎవరో వ్యక్తి వచ్చి ఆమెను కలిసి ఫోన్ నంబర్ తీసుకుని వెళ్లాడు. కాలేజీ నుంచి ఇంటికి తిరిగివచ్చి వెంటనే నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం చూసేసరికి కనిపించకుండా పోయినట్లు బాలిక తండ్రి వెల్లడించాడు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా రాత్రి 11.30 గంటల సమయంలో ఒక్కతే ఇంట్లోంచి నడుచుకుంటూ వెళ్లినట్లుగా ఉందన్నారు. డీజీపీతో విసిగిపోయినట్లుగా లేఖలో పేర్కొందని తెలిపాడు. బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అవతలి వ్యక్తి డీఐజీ కావడంతో పోలీసులు కనీస చర్యలు సైతం తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో సీఎం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలి న్దిగా వేడుకుంటున్నట్లు బాలిక తండ్రి పేర్కొన్నారు. తమ కుటుంబానికి కనీస రక్షణ లేదన్నారు. ఎవరు ఎప్పుడు తమపై దాడి చేస్తారోనని భయందోళనతో ఉన్నామన్నారు. ఏం జరుగుతుందో తెలియని ప్రాణభయంతో బ్రతుకుతున్నట్లు ఆదేదన వ్యక్తం చేశారు.

గౌరీ లంకేశ్ హత్య కేసులో అనుమానితుడి అరెస్ట్

జార్ఖండ్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు,జనవరి10(ఆర్ఎన్ఎ): ప్రముఖ జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్యకేసులో నిందితుడు ఒకరిని బెంగళూరు పోలీసులకు చెందిన ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం గురువారం రాత్రి జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ జిల్లాలో అరెస్టు చేసింది. రుషికేష్ దేవ్రీకర్ అలియాస్ రాజేష్ అలియాస్ శివ గడచిన అనేక నెలలుగా పేరు మార్చుకుని ఒక ప్రముఖ వ్యాపారికి చెందిన భవంతికి కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నాడు. అతడిని ఇక్కడి చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ రిమాండు పొంది అతడిని బెంగళూరు పోలీసు బృందానికి అప్పగిస్తామని ధన్‌బాద్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ కిషోర్ కౌశల్ తెలిపారు. ఐదు రోజులుగా అతడి కదలికలను కనిపెట్టిన బెంగళూరు పోలీసులు కత్రాస్‌లోని రాజ్‌గధియా మార్కెట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. దేవ్రీకర్ వేర్వేరు టెలిఫోన్‌లను వాడుతున్నాడని, అతడి మొబైల్ లొకేషన్ ఆధారంగా పట్టుకున్నామని పోలీసులు చెప్పారు. అతడి రూములో సోదాలు జరపగా సనాతన ధర్మానికి సంబంధించిన పుస్తకాలు లభించాయని కౌశల్ చెప్పారు. గోవాకు చెందిన ఒక మిత్రుడు సిఫార్సు చేస్తే దేవ్రీకర్‌కు ఉద్యోగం ఇచ్చానని వ్యాపారి ప్రదీప్ ఖేమ్నా వెల్లడించారు. అతడి నేర చరిత్ర గురించి తనకు తెలియదని ఆయన అన్నారు. 2017 సెప్టెంబర్ 5న గౌరీ లంకేష్ బెంగళూరులోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో ఇప్పటివరకు 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆమె హత్య వెనుక సనాతన్ సంస్థ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, గౌరి హత్యలో తమ ప్రమేయం లేదని సనాతన్ సంస్థ వాదిస్తోంది.

గృహరుణాలపై ఎస్‌బిఐ కొత్త ఆఫర్

సకాలంలో ఇల్లు అప్పగించకుంటే చెల్లింపులు వాపస్

ముంబై,జనవరి10(ఆర్ఎన్ఎ): గృహరుణ వినియోగదారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంపరాఫర్ ను ప్రకటించింది. 'రెసిడెన్షియల్ బిల్డర్ ఫైనాన్స్ విత్ బయ్యర్ గ్యారెంటీ' పేరిట రూ. 2.50 కోట్ల వరకూ ఈ రుణ సదుపాయం వర్తిస్తుందని బ్యాంకు పేర్కొంది. ఈ విధానం అర్హత ఉన్న బిల్డర్ల ప్రాజెక్టుల్లో అపార్టుమెంట్లు, విల్లాలను కొనుగోలు చేసే వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ ఆఫర్ కింద, నిర్దేశిత గడువులోగా ఇంటికి బిల్డర్ అప్పగించకుంటే, రుణ గ్రహీత చెల్లించిన ప్రిన్సిపల్ మొత్తాన్ని బ్యాంకు వెనక్కు తిరిగి ఇస్తుంది. కోటి రూపాయల విలువైన ఇంటిని కొనుగోలు చేసిన రుణగ్రహీత, రూ. 30 లక్షలను అడ్వాన్స్ గా చెల్లించారనుకోండి. బిల్డర్ హామీ మేరకు అనుకున్న సమయానికి ఇంటిని హ్యాండోవర్ చేయకుంటే, బ్యాంకు ఆ రూ. 30 లక్షలను వెనక్కు ఇస్తుంది. ఈ విషయాన్ని వెల్లడించిన బ్యాంకు చైర్మన్ రజనీశ్ కుమార్, ఈ తరహా హోమ్ ఫైనాన్స్ స్కీమ్ దేశంలో మరే బ్యాంకూ ఇవ్వడం లేదని అన్నారు. కస్టమర్ల నుంచి ఈ స్కీమ్ కు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. తొలి విడతలో ముంబై మెట్రో పాలిటన్ లో భాగమైన సన్ టెక్ డెవలపర్స్ లో ఇళ్లను కొనే వారికి ఈ స్కీమ్ కింద రుణాలను అందించనున్నామని, ఆపై దశల వారీగా మిగతా నగరాల్లో విస్తరిస్తామని అన్నారు. అదే సమయంలో అర్హత పొందిన బిల్డర్లకు రూ. 50 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకూ రుణాలను అందించనున్నామని, ఇందులో భాగంగా రుణం పొందిన బిల్డర్, ఆపరేషనల్ క్రెడిటార్ల నుంచి రుణాలు తీసుకునే అవకాశం ఉండదని, ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎస్క్రో ఖాతాలో వేయాలన్న నిబంధనను అమలు చేస్తామని రజనీశ్ కుమార్ తెలిపారు.

తనపై కోపంతో అమరావతికి చేటు చేస్తారా?

అఖిలపక్ష భేటీలో చంద్రబాబు

మచిలీపట్నం,జనవరి10(ఆర్ఎన్ఎ): తనను బాధపెట్టండి తట్టుకుంటాను.. కానీ తనపై కోపం అమరావతి మీద చూపించొద్దని టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదనా భరిత ప్రసంగం చేశారు. మచిలీపట్నంలో అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ రైతులు ఇచ్చిన భూమిని రియల్‌ఎస్టేట్ అంటున్నారు. రైతులు గుండెఆగి చనిపోతే మీకు బాధ అనిపించలేదా? కనీసం రైతుల కుటుంబాలను పరామర్శించలేదు. అమరావతి బంగారు గుడ్డుపెట్టే బాతులాంటిది. రాజధాని కావాలని విశాఖ ప్రజలు అడిగారా? ఇక్కడ రైతులకు అన్యాయం చేయాలని విశాఖ వాళ్లు కోరుకోరు. విశాఖకు వచ్చిన పెట్టుబడుల్ని వెనక్కి పంపించారు. బందర్ పోర్టుకు సీఎం జగన్ అన్యాయం చేశాడు. సీఎం జగన్‌వి నవరత్నాలు కాదు.. నవగ్రహాలు.. అందరూ వాళ్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని చంద్రబాబు విమర్శించారు. తాను ఇంత వరకు ఎవరికీ భయపడలేదని ఆయన స్పష్టం చేశారు. తనకు వయసు అయిపోయిందని మాట్లాడారని, తానొక్కడినే మీ 151 మంది ఎమ్మెల్యేలకు బుద్ధిచెప్పగలనని హెచ్చరించారు. హైపవర్ కమిటీలో వెన్నెముక లేని మంత్రులు ఉన్నారని చంద్రబాబు ఆరోపించారు.

మచిలీపట్నం వీధుల్లో జోలెపట్టిన చంద్రబాబు

అమరావతినే రాజధానిగా కొనసాగించాల